శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహారాజ్ కీ జై!   సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబాజీ కీ జై!



# కృప

విజయదశమి సంచిక

**అన్వేషణ** నుండి **ఆరాధన** వైపుగా...

# లవ్... ప్రేమ...



నీ పిల్లవాడు నీ పిల్లవాడు అని తెలిసినంత ఖచ్చితంగా, ఈ రోజున నువ్వు బాబా బిడ్డవని నీకు తెలుసా? నేను కూడా బాబా బిడ్డని అని నీకు  అనుభవంలోకి వచ్చిన రోజున, నీ బిడ్డని ప్రేమించినట్లే బాబాను ప్రేమిస్తావు.. అందుకనే బాబా కూడా అన్నారు “తండ్రికి తగ్గ బిడ్డలుకండి” అని. అంటే ఆయన ఉద్దేశం ఏమిటంటే, మనం ఆయన బిడ్డలం అన్న విషయం మనం రియలైజ్ కావడం. ఇది ఇంకా మన అనుభవంలోకి రాలేదు. చాలా సింపుల్ ఇది. మన పిల్లల్ని ప్రేమించినట్లుగా, ఉద్యోగాన్ని ప్రేమించినట్లుగా, డబ్బుని ప్రేమించినట్లుగా బాబాని ప్రేమించలేము. చాలా కామన్ ట్రూత్ అది. ఇప్పుడు మన ప్రయత్నం అంతా అలా ప్రేమించడం ఎలాగా అని తెలుసుకోవడం కోసమే, ఆ ప్రేమను పెంచుకోవడం కోసమే.

\- శ్రీబాబూజీ


**మీరు నిజంగా బాబాను ప్రేమిస్తే- ఆయనకు సంబంధించిన ప్రతి విషయాన్నీ తెలుసుకోగలుగుతారు. - శ్రీబాబూజీ**



సంపుటి : 18
అక్టోబర్ 22

# కృప

సంచిక : 4
2015



## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

- శ్రీబాబూజీ



లోపలి పేజీలలో

లవ్... ప్రేమ... 2
– గురుకృప

నిగూఢతత్త్వం 17
– శరశ్చంద్రికలు

సర్వేషుదయ 4
– ఉన్నమాట–అనుకున్నమాట

మనస్సు 8
– శరశ్చంద్రికలు

గురుకృపాలహరి 24
– గురుకృప

నిర్వహణ : *గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు*
**GURUKRUPA**
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.



# సర్వేషుదయ

"నేనే దైవాన్ని!" "నా ఆజ్ఞ లేక ఆకైనా కదలదు!" "నీవు చూచేదంతా కలిపితే నేను!" "ఎవరైతే ఈ మూడున్నర మూరల దేహాన్నే 'సాయి' అని అనుకుంటారో వారసలు 'సాయి'ని చూడనట్లే," "నా మట్టి మాట్లాడుతుంది నా సమాధి సమాధానమిస్తుంది!" "నా భక్తులు కోరినవన్నీ యిస్తాను. నేనివ్వదలిచింది వారడిగేంతవరకు". ఆశ్రయించిన జీవులనాదరించి అనుక్షణము కంటికి రెప్పఅయి, అడిగినవన్నీ ఇస్తూ – అడగాల్సిన అవసరంలేని స్థితికి చేరుస్తూ సాగే కమనీయ కళ్యాణ అభయదాయి – వారి చరణాలను చేరిన భక్తుల జీవితాలు ఎంతోహాయి – భక్తసులభుడు – శ్రీసాయి. ధర్మావతారంగా వెలసిన శ్రీరాముడు, జగద్గురువుగా అవతరించిన శ్రీకృష్ణుడు, ఇలా... కాలానుగుణంగా ఎంతో ఉన్నతమైన స్థితులలో తమను తాము వ్యక్తం చేసుకుంటూ తమ గుణ,రూప, లీలా వినోదాలతో భక్తులకు మార్గదర్శనం చేస్తూపోతే శ్రీసాయిమాత్రం ఒక పిచ్చి ఫకీరులా, జన సామాన్యునిలా, సామాన్య జనానికి ఇహములోని శ్రేయస్సునుకూర్చి – పరముపట్ల ఆసక్తిని రేకెత్తించి ఇహపరశ్రేయోదాయిగా విలసిల్లారు. శ్రీబాబూజీ అంటారు. **"శ్రీసాయిబోధ సమగ్రమైనదే! మన అవగాహనే సమగ్రం కావాల్సి వుంది"** అని ఒక్కముక్కలో చెప్పాలంటే **భక్తుల శ్రేయస్సే పరమావధిగా అవతరించిన ప్రేమైకమూర్తి సాయి.** వారి విధానం సుస్పష్టమే! ఆ సద్గురుచంద్రుని చరణ సన్నిధిని చేరాలంటే మనం సాగవలసింది జిజ్ఞాసా పథమే! అన్నీ ఇస్తానంటున్న సాయి 'మాట' ఓవైపు – ఎన్ని ఇచ్చినా ఇంకా ఇంకా కావాలనే మన కోర్కెల మేరుపర్వతం ఇంకోవైపు!... విశ్లేషణ మంచిదేగా!

***జీవ'భార'వాహకులమా? సద్గురుప్రేమకు చోదకులమా?***

రోజు మొదలయిందంటే మనసు, శరీరం ఒక చోటనుండి ఇంకొక చోటికి పరిపరివిధాలా, నాలుగు చెరగులా పరుగులు పెడుతూనే వుంటుంది. ఎక్కడికీ పరుగు అంటే బ్రతుకుబండి సాగద్దా మరి! అంటూ మనదైన రీతిలో సాకుల సమాధానాలు–ఆలోచిస్తే ఇదంతా మనసుకు ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చే ప్రయత్నం చేస్తున్నామా అని తోస్తుంది. మనసు హాయిగా ఉండటమే ఉల్లాసము, ఉత్సాహమయితే – మనసుకు ఇదిగో ఇక్కడ హాయిగా ఉంటుందని చెప్పండి. మనకు సునాయాసంగా డబ్బు లభించినపుడు, అనుకున్నవి అనుకున్నట్లు జరిగినపుడు, మనల్ని నలుగురు పొగిడినపుడు, మనం దేనినైనా సాధించినపుడు, ఉద్యోగం, వివాహం, పిల్లలు, ర్యాంకులు... ఇలా ఒక పుస్తకమే రాయచ్చు మన కోర్కెల చిట్టాలతోటి! సరే ఇవన్నీ వచ్చిన ప్రతీసారి ఎంతసేపు ఆ ఆనందం ఉంటుంది అంటే? మహాఅయితే కొన్ని గంటలు, ఇంకా అయితే కొన్ని రోజులు, మళ్ళీ మొదలు మరోదానికోసం మన ఆరాటం. ఇది ప్రతీవ్యక్తి జీవితంలో ఎదురయ్యే సామాన్యకథ – తీరనంటున్న కోర్కెల గాథ. ఏరా ఏమిటి ఇదంతా అంటే అన్నీ తెలిసిన వాడిలా – ఇదేకదా జీవితమంటే, అంటూ ఏదో భారంగా, బ్రహ్మపదార్ధంలా తలుస్తూ జీవభారవాహకులమవుతున్నాము. ఒకవేళ ఇదేమన జీవితమయితే – ఇక ఆకలివేసినపుడల్లా పరుగులెత్తే పశుపక్ష్యాదులకు, మనకు తేడా ఏముంది. లేదండీ

**నిబద్ధత, అంకిత భావం, ఆచరణ - ఇవి మనం మహాత్ముల జీవితాల నుండి నేర్చుకోవలసింది. -శ్రీబాబూజీ**

మాకింకా ఎక్కువ అర్హతలు ఉన్నాయి. మచ్చుకు కామ, క్రోధ, అసూయ, ద్వేషాలు ఇత్యాదులన్నీను. మానవీయంగా మసలుతున్నామా? ఆలోచిస్తున్నామా అసలు? వివేకము మరియు విచక్షణ ఉన్నాయా? సమన్వయంతో అర్థం చేసుకుని జీవితానికి అన్వయించుకుంటున్నామా? మరి అసలు జీవితమంటే ఇదికాక మరేమిటి?



***జీవితమంటే ?***

దైవం కోసం జీవించడం – అంటే – మనకోసమే జీవిస్తున్న ఆయన కోసం – ఎందుకు బాబా వచ్చారు? ఎలా జీవించారు? ఎట్లాఉన్నారు? ఆయన మననుంచి ఏం ఆశించారు? ఇవి తెలుసుకునే ప్రయత్నము – ఆ అన్వేషణాపథంలో సాగే మన పయనం, మనకోసం ఆయన జీవించినట్లు మనం ఆయన కోసంగా జీవించగలిగే ప్రయత్నం చేయడం – సర్వకాల సర్వావస్థలయందు సర్వభూతములందు ఆ ప్రేమమూర్తి వర్షించిన అపార, అవ్యాజ కరుణను – దర్శించడం. ఇదేమో చేయవలసింది, ఆలోచిద్దాం. మన తీరు ఎలా ఉందంటే భగవంతుడ్ని ప్రేమించవలసింది పోయి, పూజించడం నేర్చుకున్నాం – విగ్రహాన్ని దైవంగా చూడడం పోయి, దైవాన్ని విగ్రహం చేస్తున్నాం. అంతరంగం తెలుసుకోవాల్సింది పోయి, ఆడంబరం చేయడానికి అలవాటు పడుతున్నాం. ఆయన్ను తెలుసుకుంటూ, ఆయన ద్వారా నేర్చుకుంటే అది పండుగ – లేదంటే అది దండగ! మనం ఎన్ని పండుగలు చేసుకుంటున్నాం? ఎన్ని దండుగలు చేసుకుంటున్నాం? మన ఉనికికి మూలాధారమైన భగవంతుడిని మరియు ఆయనకు ప్రతిరూపమైన మన గురువును ప్రేమిస్తూ గడిపేదే జీవితం. ప్రతి విషయానికి మూలాధారం మన గురువన్న ఎరుక మనతో ఉండటమే జీవితమంటే మన ఉనికికి ఆయనే ఆధారమంటే సరిపోతుందా? మనకు అవగతం కావడానికి భాగవత కృతికర్త పోతనామాత్యుడు ఇలా అంటాడు

**"ఎవ్వని యవతార మెల్ల భూతములకు సుఖమును వృద్ధియు సొరిదిజేయు!**
**నెవ్వని శుభనామ మే ప్రొద్దు నుడువంగ సంసార బంధంబు సమసిపోవు!**
**నెవ్వని చరితంబు హృదయంబు జేర్పంగ భయమంది మృత్యువు పరువువెట్టు!**
**నెవ్వని పదనది నేపారు జలముల సేవింప నైర్మల్యసిద్ధి గలుగు"!**

ఏ మహానుభావుని అవతారం ఈ జగత్తులోని సమస్త జీవులకు ఆనందాన్ని, అభివృద్ధిని అందిస్తుందో. ఏ మహానుభావుని దివ్యనామాన్ని ఎల్లప్పుడూ ఉచ్చరించడం మూలాన భవబంధాలన్నీ పటాపంచలైపోతాయో, ఏ మహానుభావుని పవిత్ర చరిత్రాన్ని భావించిన మాత్రం చేతనే మృత్యుదేవత భయపడి పారిపోతుందో, ఏ మహానుభావుని పాదాలనుంచి ఉద్భవించిన నదీజలాలను సేవించినంత మాత్రాన సమస్త కల్మషాలూ నశించి పావనత్వం ప్రాప్తిస్తుందో, ఏ మహానుభావుని చరణాలను సమాశ్రయించి సంయమీంద్రులు శాంతిమార్గాన్ని సాధించారో ఆ మహానుభావుని చరణాలను సదాశ్రయించుట శ్రేష్ఠము.

**జ్ఞాని యొక్క స్థితిని - మీరు జ్ఞానాన్ని పొందినప్పుడుగానీ- తాను ఏ స్థితిలో ఉన్నాడో తెలుసుకోగలరు. -శ్రీరమణులు**



**మిఠాయిలాంటి మాట-మారాలి మనబాట**

పండరీపురం నుంచి వచ్చిన ప్లీడరును ఉద్దేశించి బాబా అన్నమాటలు "ప్రజలెంత టక్కరులు? వారు పాదములపై బడదెరు. దక్షిణ నిచ్చెదరు. కానీ చాటుననిందించెదరు. ఇది చిత్రముగాదా?" తననుద్దేశించి బాబా అన్నమాటలు అని అతనికి-బాబాకు మాత్రమే తెలుసు. కానీ అడగకుండానే దీక్షిత్‌తో అంటాడు, "బాబా చెప్పినదంతయు యదార్ధమే. ఆ బాణము నాపై ప్రయోగించిరి. అది నా గూర్చియే! నేనెవరిని నిందించకూడదు, తృణీకరించరాదని బోధించుచున్నది అని ఇంకా అంటాడు "బాబా నేను చేసినది సమంజసము కాదని నిరూపించెను. ఇది నాకు దూషణకాదు. నాకిది యాశీర్వచనమే. ఇది నాకు ఉపదేశము. నేనిక మీదట ఎవరిని దూషించరాదు, ఎవరినీ నిందించరాదు, ఇతరుల విషయములో జోక్యము కలుగజేసికొనరాదు" అని. సరిగ్గా చూస్తే ప్లీడరులో వచ్చిన మార్పు శ్రీసాయి మహారాజ్ నేర్పు. ఆలోచిస్తే **మహాత్ముల సన్నిధానమంటే అది ఆశీర్వాదాల దర్బారు.** ఎంతటి గొప్పదంటే చెట్టుకు రాయి విసిరినా ఇచ్చేది పండు మాత్రమే! పిచ్చి ఫకీరుగా భావించిన చిన్నారులు సాయిపై రాళ్ళు విసిరినా, తానుమాత్రం ప్రతీ చిన్నారికి వారి అభిరుచిననుసరించి మిఠాయి తినిపించడం ఎలాంటిదంటారు ఈ లీలలో మనల్ని మనం చూసుకుంటే, మన అడుగులతో అన్వయం చేసుకుంటే, ఆ చిన్నారుల పాత్రలో పరాయణత చెందితే, అధ్యయనంతో ఆలోచన మార్చుకుంటే, సంఘటనలోని సారాంశంతో సమన్వయం చేసుకుని మనకు ఎదురయ్యే ప్రతీ సంఘటనలలో సంయమనం పాటిస్తే, బాబా లీలలలోని బోధను గ్రహించి బాబా పద్ధతులు నచ్చినవారమై ఆయనవారమై, ఆయన పద్ధతులు పాటిస్తూ, ఆయన మార్గాన్ని అనుసరించిన వారమవుతాము. లేనినాడు ఆయన మార్గంనుండి వైదొలిగివారమవుతాము. గమనిస్తే అనుకూల, ప్రతికూల-పరిస్థితులకు, శీతోష్ణాలకు దేనికీ స్పందించక కేవలం ఫలాలనిచ్చే కల్పవృక్షం సద్గురువు. వారిచ్చేది తీసుకోవడం-లేనిపోని అవసరం కాని దుర్గుణాల మేలుకలయికగా మారి నాకు అదికావాలి, ఇది కావాలి అంటూ సకల జీవుల భారాలను మీదవేసుకుంటూ సాగిపోవడం-ఇలా కనుక మన జీవితముంటే తప్పక సరిదిద్దుకుందాం. **ఆశీర్వాదాల దర్బారులో సాగే ఆనందాల అభినివేశాలలో పాత్రలుగా నిలుద్దాముకానీ, సాటి వారితో పోటీలకు, పంతాలకు పోయి-ఎప్పుడూ లేమితో సాగుతున్నట్లు గురుమహారాజ్ చెంత నిలవకుండా ఉండే ప్రయత్నం చేద్దాం. ప్రయత్నం మనది ప్రయాస ఆ సద్గురునాధునిది! బిడ్డల బాగోగులే వారికి ఆనందం కదా!**

**పారాయణ అయితే 'సరి' – తప్పక చేరతాము 'హరి'**

"పనిచెయ్యి, సద్గ్రంధాలు చదువు, దేవునినామం ఉచ్చరించు" అంటూ చెప్పిన బాబా మాటలు శృతివాక్యాలయితే జీవితమంతా వైభవమే కానీ, వైధవ్యం ఉండదు. భుక్తి కోసం పనిచేసి – జీవితంపట్ల ఆసక్తి సద్గ్రంధం కలుగచేసి – 'హరి' నామ స్మరణతో దైవంపట్ల అనురక్తి కలిగి మనిషి గురువు అనే



గమ్యం చేరేందుకు శ్రీసాయి మనచెవిలో ఊదని ఉపదేశమది! సద్గ్రంధాలు చదవమని బాబా చెప్పారని పారాయణ సామ్రాట్టులుగా మారి 'తంతు' తలకెక్కించుకుంటామని తెలిసిన సద్గురునాధుడు మరలా శ్రీబాబూజీ వంటి గురుచంద్రుని పంపి **"ఒకానొక మహోత్తర అంశాన్ని కూలంకషంగా అధ్యయనంచేసి అపారమైన దాని తత్వాన్ని ఆకళింపు చేసుకునే సాధనం-పారాయణ"** అంటూ సాయిభక్తి సాధనను సరళంగా - సూటిగా అందించారు. చేసే పారాయణ బాబాను గూర్చి తెలుసుకోవడానికా? సాయిని నిరంతరం ఎరుకలో నిలుపుకోవడానికా! ఎందుకు చేస్తున్నాం? పాత్రలో లీనమయితే నిజానికి మన స్వభావం తెలుస్తుంది. ఈ స్వభావం బాబాకు దగ్గర చేర్చేదా? కాదా? అన్న విశ్లేషణ మనలో నిలుస్తుంది. ఒక చరిత్రకారుడు అంటాడు "భారతం మనం ఎలా ఉన్నామో తెలిపితే, రామాయణం ఎలా ఉండాలో చెపుతుంది. భాగవతం మనం చివరకు ఏమి పొందాలో తెలుపుతుంది అని. సత్యద్రష్ట (సత్యాన్ని దర్శించగల్గిన)లైన మహాత్ముల చరిత్రలు మనల్ని సదా ఆ సత్స్వరూపుల ఎరుకలో నిలుపుతాయి. మనలోని మాలిన్యాలను శుద్ధిచేస్తూ, సాటిజీవులలోనూ ఉన్న ఆ విరాట్ స్వరూపాన్ని దర్శించే భాగ్యాన్ని కలుగచేస్తాయి సద్గ్రంధాలు. పాత్రలో లీనమయి చేసిన పారాయణ మనిషిలో పరివర్తన కలిగిస్తుంది, అంతేకానీ, పేజీలసంఖ్యలో, తంతుల గుంపులో చేరితే, మనిషిలో వచ్చేది అహంస్ఫురణల ఆవర్తన. మనకేది కావాలనేదే మన నిర్ణయం.

### *పరుడు - పరాత్పరుడే !*


శ్రీసాయి అనే సత్‌పదార్ధంతో సదా సాంగత్యంలో ఉన్నారు కనుకనే శ్రీబాబూజీ అనే ప్రేమయోగి శరశ్చంద్రునిలా చల్లని వెన్నెలనే కురిపించాడు. వారికి శ్రీసాయి సహస్ర శిరములతో, సహస్ర బాహువులతో మనందరి రూపాలుగా దర్శనమిచ్చాడు. ఈ మాటలలో సత్యమెంత ఉన్నది ఎవరికి వారుగా బేరీజు వేసుకోవాల్సిందే. ఎందుకంటే గురుదేవులు వర్షించిన ప్రేమ ఎవరికి వారికి వ్యక్తిగతమే, ప్రేమామృతమే. పరుడంటే వారికి 'సాయి' అనే పరాత్పరుడుగా సాగింది వారి జీవితం. జీవిత పర్యంతం ఏనాడూ లేదు 'బాధ' అన్న పదం. **అభిమానించిన వారికి - ఈసడించిన వారికి కూడా ఒక్కటే ఆధారం - శ్రీసాయి ఆశీర్వాదం.**

మనందరిలో వారు శ్రీసాయిని దర్శిస్తే - మనచుట్టూ ఉన్న వారిలో మనం మన గురువును దర్శిస్తున్నామా? దర్శించే ప్రయత్నం చేస్తున్నామా? ఒక్క అడుగు వేయలేమా? వేస్తే మనలోని మార్పు ఎలావుంటుంది? గురుదేవులకు మనపట్ల కలిగే భావాలేమిటి? తండ్రికి తగ్గ బిడ్డలమవ్వలేమా? **'విజయ' 'దశ'మి మనలోని కుత్సితాలను దునిమి సాయిపథయానంలో విజయాన్ని, సద్గురుచరణాలను చేరే 'దిశ'ను చూపించలేదా? ఆలోచిద్దాం... మారే ప్రయత్నం చేద్దాం... గురుదేవా మీరే మాతోడు! బాబా... మీరే మానీడ....**

**- గురుకృప**



## మనస్సు ఆగష్టు 2015



**భక్తుడు :** గురువుగారూ! మనశ్శాంతి (పీస్ ఆఫ్ మైండ్) అంటే ఏమిటి?

**గురువుగారు :** మనస్సును ముక్కలు ముక్కలుగా (పీసెస్‌గా) చెయ్యకుండా ఉండటం. (గురువుగారు నవ్వుతూ) మనస్సును ఒకే ఖండంగా (పీస్‌గా) ఉంచుకోవడమే మనశ్శాంతి (పీస్ఆఫ్ మైండ్) అంటే.

**భక్తుడు :** అంటే మనస్సును రకరకాల వైపులకు లాగే ఆకర్షణలు లేకపోవడమా?

**గురువుగారు :** ఆకర్షణలు మనస్సును ముక్కలుగా చేస్తాయి. అవి మనస్సును ఒకే ముక్కగా ఉండనివ్వవు. మనకు మనస్సు ఎప్పుడూ ముక్కలు ముక్కలు గానే అనుభవమవుతుంది. ఇటువంటి ముక్కలు లేకపోతే మనకు మనశ్శాంతి ఉంటుంది.

**భక్తుడు :** మహాత్ములు కొన్ని సందర్భాలలో తమకు మనస్సే లేదంటారు, వారు చెప్పే 'మనస్సు స్థితి' మనందరికీ ఉండే మనస్సుకు మధ్య వ్యత్యాసం ఏమిటి?

**గురువుగారు :** మనకుండే మనస్సు వారికి లేదు (గురువుగారు నవ్వుతూ) ప్రగాఢంగా మనలో ముద్రించుకుపోయిన భావనలు, అవగాహన, లేక అవగాహనారాహిత్యం (ఒక విషయాన్ని) మెచ్చుకోగలగడం లేదా మెచ్చుకోలేకపోవడం, మన బాధ లేక సంతోషం... ఇటువంటి వాటన్నింటికీ మనలో కలిగే ప్రతిస్పందనల ఫలితాన్ని మనం మనస్సు అంటాం – ఇలాంటివి వారికి లేవు. ఆ స్థితిని గురించి వివరించడం చాలా కష్టం. రమణమహర్షి కూడా "నేను ఆ స్థితి గురించి వర్ణించలేను" అన్నారు. రమణులంతటి వారే ఆ స్థితిని గురించి చెప్పలేనప్పుడు నేను దానికి పూనుకోవడం అవివేకమే.

**భక్తుడు :** గురువుగారూ! మీరు మనస్సుకు ఎటువంటి విలువనిస్తారు? ఆధ్యాత్మిక వర్గాలలో తరచుగా మనస్సుపట్ల ఒక రకమైన హేయభావనను కలిగిఉండటాన్ని నేను గమనించాను. నేను కూడా కొన్నిసార్లు జరుగుతున్న సంఘటనలపట్ల, విషయాలపట్ల ఒకలాంటి నిర్లిప్త భావనతో ఉంటాను. మనస్సును ఎలా ఉపయోగించుకుంటే ఉత్తమంగా ఉంటుంది?

**నిశ్చల మనసును మించిన నీరాజనం లేదు.**



**గురువుగారు :** మీరు మీ మనస్సును ఉపయోగపెట్టుకోగలరా? మీరు దానిని ఉపయోగించుకోవాలంటే అది మీ ఆధీనంలో ఉండాలి. మీ మనస్సు మీద మీకు అదుపు (కంట్రోల్) లేనప్పుడు దానిని అత్యుత్తమంగా ఉపయోగపెట్టుకోవడం ఎలాగో నేను మీకు చెప్పడంలో అర్థమేముంటుంది? నేను చెప్తాను సరే, మీరు అలా ఉపయోగపెట్టుకోగలరా?

**భక్తుడు :** ఎప్పుడైనా మన భావోద్వేగాలు బలంగా ఉన్నప్పుడు కాస్త తార్కికమైన అవగాహన ఉంటే సహాయకారిగా ఉంటుంది.

**గురువుగారు :** మీ భావోద్వేగాలు (ఎమోషన్స్) తీవ్రంగా ఉన్నాయంటే మీ మనస్సు మీద మీకు అదుపులేనట్లు లెక్క. సమస్య మనస్సుతో కాదు, మనలో ఆలోచనలు రేకెత్తించే భావోద్వేగాలలో ఉంది. మీ భావోద్వేగాలు ఎలా ఉంటాయో దానిని బట్టి మీ ఆలోచనలు ఉంటాయి. మీరు మీ భావోద్వేగాల మధ్య సామరస్యాన్ని, స్థిరత్వాన్ని సాధించినప్పుడు మీ మనస్సు ప్రశాంతంగా ఉండి మీ ఆధీనంలో ఉంటుంది. అప్పుడు మనస్సును ఎలా చక్కగా ఉపయోగపెట్టుకోవాలో దానికై అదే తెలుస్తుంది. మీరు దానిని వాడుకోవాలంటే వాడుకోవచ్చు. మీరు వద్దనుకుంటే దానిని ప్రక్కనపెట్టి ఎక్కడైనా దాచుకోవచ్చు. (గురువుగారు నవ్వుతూ...) ఎటువంటి భావోద్వేగంతోనూ సంబంధంలేని ఆలోచనలు కూడా కొన్ని ఉంటాయి. అవి అలా ఊరకనే వచ్చే గాలివాటం ఆలోచనలు. ఇటువంటి ఆలోచనలను రకరకాల సాధనల ద్వారా అదుపు చేసుకోవచ్చు.

**భక్తుడు :** ఊరకనే చెదురుమదురుగా వచ్చే గాలివాటం ఆలోచనలను అదుపు చెయ్యాల్సిన అవసరం ఉందా?

**గురువుగారు :** అవును, ఆ అవసరం ఉంది. ఎందుకంటే అవి మన శ్రద్ధను, లక్ష్యదృష్టిని బలహీన పరుస్తాయి. ఎందుకూ పనికిరాని గాలి ఆలోచనలలో మన శక్తంతా వృధా అయిపోతుంది. ఇటువంటి ఆలోచనలు ఎప్పుడూ అరుస్తూ మన పని చెడగొట్టే వీధి కుక్కల్లాంటివి. ఈ పనికిరాని ఆలోచనల మీద మనకు అదుపు వస్తే అవి అవసరమైనప్పుడు మాత్రమే అరిచే మన పెంపుడు కుక్కల్లాగా మారతాయి.

మన ప్రధానమైన సమస్యేమిటంటే మనకు కనీసం ఈ గాలి ఆలోచనలను వదిలించుకోవాలన్న తీవ్రమైన కోరికగానీ, మనల్ని ఆ గాలి ఆలోచనల నుంచి బయటకు లాగాలనే బలమైన ఆలోచనలు గానీ ఏమీ ఉండవు. అసలు ఈ పనికిరాని ఆలోచనలు ఎందుకు వస్తాయి? మనకు అర్థవంతమైన



ఆలోచనలు రావడానికి కావలసిన మంచి భావోద్వేగాలు లేకపోవడం వలన ఆ ఖాళీని లేదా ఆ శూన్యాన్ని పూరించడానికి ఇలాంటి చెత్త ఆలోచనలు వస్తాయి. ఇవి మనలోని డొల్లతనాన్ని భర్తీ చేసే చెత్త సరకు. అందుకే మన లక్ష్యంపట్ల శ్రద్ధను నిలుపుకోవడానికి మనకు సరైన భావోద్వేగం అవసరమవుతుంది.

**భక్తుడు :** సద్గురువుపట్ల గల ప్రేమ అనే ఒక ప్రధానమైన భావోద్వేగం (ఎమోషన్) మీద దృష్టిపెడితే మిగతా భావోద్వేగాలను ఆధీనంలోకి తెచ్చుకోవచ్చని మీ ఉద్దేశ్యమా గురువుగారూ?

**గురువుగారు :** అవును, అదే నా ఉద్దేశ్యం. ప్రేమ ద్వారా భావోద్వేగాలను నియంత్రించడం – ప్రేమానుభవాన్ని పొందడం, ప్రేమను అభివ్యక్తీకరించడం, ప్రేమను కలిగించుకోవడం, ప్రేమతో నింపుకోవడం మొదలైనవి. మీరు మౌనంగా ధ్యానస్థులైనపుడు, లేదా బాబా నామాన్ని జపిస్తున్నప్పుడు లేదా బాబా చిత్రపటం మీద దృష్టిని కేంద్రీకరించినప్పుడు, బాబా గురించి చదివినప్పుడు మీరు చేసేది, ఇది వరకు నేను చెప్పినటువంటి గాలి ఆలోచనలను అదుపుచేయడం, ఇలా చాలా రకాలైన పద్ధతులు ఉన్నాయి. – 'గాలి' పద్ధతులు – మీరు వీటిని మీకు తగినట్లుగా మార్చుకొని అభ్యాసం చెయ్యవచ్చు.

**భక్తుడు :** కానీ భావోద్వేగాలు దెబ్బతిన్నపుడు ఈ అభ్యాసాలేవీ పనిచేస్తున్నట్లు కనిపించడం లేదు.

**గురువుగారు :** అలాంటపుడు దానికున్న ఏకైక పద్ధతి ప్రేమ. అది మీ చేతుల్లో లేదు. మీరు కేవలం మీ గాలి ఆలోచనల గురించి మాత్రమే ఏమైనా చెయ్యగలరు. మీరు వాటి గురించి జాగ్రత్త తీసుకుంటే మీరు ఒక పెంపుడు జంతువుగా, బాబాకు పెంపుడు జంతువుగా మారుతారు. లేకపోతే మన మనస్సు వీధి కుక్కలాగా ఉంటుంది. మనం ఏమి చూసినా దానివైపుకు పరిగెడుతాం, దాని వెనుక పడతాం. మనకు ఎవరైనా ఏదైనా ఇస్తే దానిని ఆబగా అందుకుంటాం. ఊరికే వస్తుంది కదా, తీసుకుందాం (గురువుగారు నవ్వుతూ...) ఇది వీధి కుక్కల లక్షణం.

**గురువుగారు :** మీరెవరు అనే విషయం (మీ ఐడెంటిటీ) మీ భావోద్వేగాల మీద ఆధారపడి ఉంటుంది. అది మీ ఆలోచనల మీద ఆధారపడి ఉండదు. మీరెవరు, మీ వ్యకిత్వమేమిటనేది మీ ఆలోచనల కంటే లోతుగా ఉంటుంది. మీకొచ్చే ఆలోచనలన్నీ భావోద్వేగాల మీద ఆధారపడి ఉంటాయి. అందుకే వేదాంత పరిభాషలో హృదయాన్ని సూర్యుడని, మనస్సును చంద్రుడని చెప్తారు. చంద్రుడు తన కాంతిని సూర్యుని నుండి పొందుతాడు. "మనస్సు తెర వంటిది, హృదయం ప్రొజెక్టర్ వంటిది" – భగవాన్ చెప్పిన పోలిక ఇది. దాని గురించి ఆలోచించి చూడండి. మీకు అర్థమవుతుంది.



మీరు ఏదైనా మార్పు సాధించాలంటే మీరు తెరవద్ద కాకుండా హృదయంవద్ద, అంటే ప్రొజెక్టర్ వద్ద ప్రయత్నించాలి.

సమస్యేమిటంటే మనస్సు చాలా సందర్భాలలో హృదయానికి వ్యతిరేకంగా ఉంటుంది. హృదయం, మనస్సు స్నేహితులుగా మారినపుడు వాటి రెండింటినీ ఒకదానిలోని పరస్పరం సహకరించుకునే రెండు భాగాలుగా చూడగలుగుతారు. అప్పుడు మనస్సు, హృదయం రెండూ ఎదుగుతాయి.

**భక్తుడు :** గురువుగారూ! మనస్సును తెలుసుకోవడం ఎలా?

**గురువుగారు :** ఏ విషయాన్నైనా మనం ఎలా తెలుసుకుంటాం? దానిని గమనించడం ద్వారానే కదా. నా గురించి బాగా తెలుసుకోవాలంటే, మీరు నన్ను గమనించాలి. ఆయన (గురువుగారు) ఏమి చేస్తున్నారు? ఎలా కూర్చొని ఉన్నారు? ఆయన పనులు ఎలా చేస్తారు? ఇలాగే మీ మనస్సు గురించి తెలుసుకోవాలంటే మీరు దానిని గమనించాలి. మీరలా గమనిస్తూ, గుర్తిస్తూ పోతే మీరు మనస్సు యొక్క అనుపానులు మొత్తం తెలుసుకోగలుగుతారు.

మీ మనస్సులో ఏమి జరుగుతుందో తెలుసుకోవాలనే విచక్షణాదృష్టి ఉంటే నిర్ణీత సమయాలలో కేవలం నిర్ణీతమైన ఆలోచనలే వస్తున్నట్లుగా మీరు గుర్తించగలుగుతారు. అవి నిర్ణీత క్రమంలో వస్తాయి. ఉదాహరణకు, మీరు పళ్ళు తోముకునేటప్పుడు కొన్ని ఆలోచనలు వస్తాయి. వాటిని గమనించి గుర్తుపెట్టుకోండి. ఆ తరువాత రోజు మీరు పళ్ళు తోముకునేటప్పుడు అదే తరహా ఆలోచనలు మళ్ళీ రావడం గమనించగలరు. మీరు మెట్లు దిగేటప్పుడు ఒక ఆలోచన వస్తుంది. మళ్ళీ ఇరవై నాలుగు గంటలు గడిచి మీరు మళ్ళీ మెట్లు దిగేదాకా ఆ ఆలోచన రాదు. మీరు మెట్ల దగ్గరగా రాగానే ఆ ఆలోచన హఠాత్తుగా వస్తుంది.

మనస్సు విభిన్నమైన క్రమాలలో పనిచేస్తుంది. మనస్సు పనిచేసే పద్ధతిని బట్టి, అలవాట్లు, క్రమాలను బట్టి చాలా రకాలైన ఆధ్యాత్మిక సాధనలు రూపొందించడం జరిగింది. మంత్రం, జపం, ధ్యానం, ప్రాణాయామం... ఇలాంటి సాధనలన్నీ. ఈ సాధనలన్నీ పునరావృతమయ్యే ఆలోచనా సరళిని అధిగమించడం కోసమే. అందుకే ప్రతిరోజూ నిర్దిష్టమైన సమయంలో ఒక గంటసేపు ధ్యానం చేసుకోవడం మంచిది. మీరు కేవలం అదే సమయంలో ధ్యానం చెయ్యాలనేం లేదు, మీరు కాస్త ఎక్కువసేపు కూడా ధ్యానం చేసుకోవచ్చు లేదా అర్జంటు పని ఉంటే ముందే వెళ్ళిపోవచ్చు. మీకు తేడా అంత త్వరగా గుర్తింపులోకి రాకపోవచ్చు. కానీ మీరలా అభ్యాసం చేస్తూ పోతే మీరు ఆ

తేడాను అనుభూతి చెందగలరు. ఉదాహరణకు మీరు ప్రతిరోజూ తొమ్మిది, పది గంటల మధ్య ధ్యానం చేస్తే ఒక నెల రోజుల తరువాత మీరు ఎక్కడున్నా, ఏమి చేస్తున్నా – ఆఫీసులో ఉన్నా, మీటింగులో ఉన్నా – ఆ సమయానికి మనస్సు నిశ్చలం అవుతుంది. ఎటువంటి ప్రయత్నం లేకుండా ధ్యానస్థితి కలుగుతుంది. దీనికి కారణం మనస్సు యొక్క సహజధర్మం. ఇందులోని సూక్ష్మాలన్నింటినీ మీరు అర్థం చేసుకోనవసరం లేదు. మీరు దానిని గమనిస్తూ పోతే మీకు ఈ విషయం అర్థమవుతుంది. అప్పుడు మనస్సు మిమ్మల్ని మభ్యపెట్టదు – మీరే దానిని మభ్యపెట్టవచ్చు (నవ్వులు) మీరు ఇప్పుడు పరిశోధన మొదలుపెట్టారు, మీ మనస్సుని నిరంతరం కనిపెట్టి ఉండండి (గురువుగారు నవ్వుతూ...)



**భక్తుడు :** గురువుగారూ! ఆలోచనలు ఆగడానికి, ఆనందానుభవం పొందడానికి మధ్య గల సంబంధం ఏమిటి? ఏకాగ్రత కోసం వాడే పద్ధతులు దానికెలా దోహదపడతాయి?

**గురువుగారు :** యోగసూత్రాలలో యోగసాధన యొక్క లక్ష్యం ఏకాగ్రత కాదంటాడు పతంజలి. "యోగఃచిత్తవృత్తినిరోధః" – "ఆలోచనా ప్రవాహాన్ని ఆపడమే యోగం" అని చెప్తాడు. అది ఆయన నిర్వచనం. అది సరే, మనమందరమూ మనస్సును ఏకాగ్రం చేయడానికి ఏదో ఒక విషయంపైన దానిని కేంద్రీకరించడానికి ప్రయత్నిస్తాం, తద్వారా మనోవికాసం పొందుతాము. మనోవికాసభావనను అంటిపెట్టుకోవడం కూడా ఒకరకమైన ఏకాగ్రతే. మనం పరిమితమైన విషయంపైన కాకుండా విస్తృతమైన వస్తువుపై మనస్సును కేంద్రీకరిస్తాం. సాధారణంగా మన దృష్టిలో ఏకాగ్రతంటే తదేకంగా ఒకే వస్తువునుగానీ లేదా ఒక మనోధర్మాన్నిగానీ అంటిపెట్టుకొని ఉండటం. కొందరు ఇలా గమనించేదెవరో గమనిస్తూ 'నేను' పట్ల ఎరుకతో ఉండమని అంటారు. మరికొందరు ఆలోచనా ప్రవాహాన్ని గమనిస్తూ ఉండమంటారు. ఇంకొందరు, "సాయిబాబా వంటి అమోఘమైన రూపాన్ని చూస్తూ ఉండగలిగే అవకాశం ఉన్నప్పుడు సాధారణమైన ఆలోచనలను గమనిస్తూ ఉండటం ఎందుకు?" అంటారు. చాలారకాల పద్ధతులు ఉన్నాయి. కానీ ఎప్పుడూ ఏదో ఒకదానిని గమనిస్తూ ఉండటం కోసం, పూర్తిజాగరూకతతో ఉండటం కోసం ఈ పద్ధతులన్నీ మనకు వాచ్‌మెన్ ఉద్యోగాన్నిస్తాయి. మనం ప్రయత్నం చేసేది ఆ ఎరుకను సాధించడానికి కాదు. ఆ ఎరుక ఎప్పుడూ ఉంది. కానీ రకరకాల విషయాలపట్ల ఎరుకతో ఉండటం కన్నా మనం కేవలం ఒకేవస్తువుపట్ల ఎరుకతో ఉండాలని అనుకుంటున్నాం. అది సాయిబాబా కావచ్చు, మన ఆలోచనలు కావచ్చు, మనస్సు కావచ్చు లేదా "ఆత్మ" కావచ్చు లేదా మీ స్వభావానికి తగినది ఏదైనా కావచ్చు. ఎప్పుడూ

**అసంతృప్తి, అశాంతి నిండిన మనసు పురుగుపట్టి పూజార్హం కాని పువ్వులాంటిది.**



ఒక విషయం నుండి మరో విషయానికి మారుతూ ఉండటం మనస్సు యొక్క సహజమైన ధర్మం. మనం ఆ చలనాన్ని ఆపితే మనస్సు ఆగుతుంది. ఆ స్థితిని పొందడానికి ఇటువంటి పద్ధతులన్నీ మిమ్మల్ని ఏదో ఒక్క విషయాన్నే పట్టుకోమంటాయి.

నేను మీకిప్పుడు ఏకాగ్రత అంటే ఏమిటో చెప్పాను. మీరడిగిన ప్రశ్నేమిటంటే ఈ ఏకాగ్రతకు, ఆనందానుభూతికి మధ్య గల సంబంధమేమిటి అని. ధ్యానం చేసే వారందరూ ఒకరకమైన ఆనందానుభూతి లక్ష్యంగా ధ్యానం చేస్తున్నట్లు అనిపిస్తుంది. మీరు దానిని ఆనందానుభూతి అనండి, బంధరహితమైన స్థితి అనండి, ముక్తి, నిర్వాణం, ఈ పేర్లన్నీ ఆ పరిపూర్ణత్వస్థితికి రకరకాల పేర్లు. ఒక నిర్ణీత వస్తువును గమనిస్తూ ఆలోచనలను ఆపడం ఆ ఆనందానుభూతికి ఎలా దోహదం చేస్తుంది? ఆనందం మన లోపలే ఉందని, ఆలోచనలు దానికి అడ్డుతెరలుగా పనిచేస్తున్నాయనే అవగాహన మనకు కలిగించారు. కాబట్టి మనం ఆలోచనా ప్రవాహాన్ని ఆపి,తెరను తొలగిస్తే అప్పటికే మన లోపల ఉన్న ఆనందాన్ని అనుభూతి చెందవచ్చు అన్నారు. స్థిరచిత్తంతో అంతరంగంలోనికి చూస్తే రకరకాల తెరలు తొలగిపోయి ఆ తెరల వెనుకనున్నది మీకు గోచరమవుతుంది – అందుకే దానిని 'అంతర్దృష్టి' అన్నారు. రకరకాల బోధనా పద్ధతులలో అంతర్లీనంగా ఉన్న సిద్ధాంతమిది.

పద్ధతులు వేలకొద్దీ ఉన్నాయి. నాకు తెలిసినంతవరకు ఈ పద్ధతులలో చాలావరకు మన అంతరంగంలో సహజంగానే ఉండేదానికి (ఆనందానుభూతికి)గల అడ్డాలను తొలగించడానికి ఉద్దేశింపబడ్డాయి. మనం రూపంమీద ఏకాగ్రం చేసినా అది నిరాకారానికి దారితీస్తుంది. ఒక వస్తువు మీద మనస్సును ఏకాగ్రం చేయడం వలన నిరంతరంగా ఒక విషయం నుండి మరొక విషయానికి పోయే అలవాటును పోగొట్టుకొని మనస్సును కేవలం ఒకే విషయంపైన పెట్టగలం. అప్పుడది సహజంగానే అంతర్ముఖమై, పూర్ణమైన ఎరుకతో మమేకమవుతుంది. దానినే సంస్కృతంలో చైతన్యఘనత అన్నారు. ఈ పద్ధతులు ఉపయోగపడతాయా లేదా, అవి మీ అవసరాలకు సంబంధించినవా కావా అనేది వేరే విషయం.

ప్రాథమికమైన సమస్యేమిటంటే మీరు ఆనందానుభూతిని ఒక వస్తువుగా భావిస్తారు. అది లోపల ఎక్కడో ఉందని, మీరు దానిని అందుకోవాలని, లేదా సరైన తాళాన్ని వెతుక్కుని ఆ ఆనందపు గది

**మనసును పవిత్రం చేయని పూజ, జపతపాలు, మనన క్రియలతో ప్రయోజనం ఉండదు.**



తలుపులు తెరవాలి అనుకుంటున్నారు.

నేనేమంటానంటే, ఆలోచనలను ఆపేదెలా అని ఆలోచించేబదులు అసలు ఆలోచనలు ఎందుకొస్తున్నాయో ఆలోచించడానికి ప్రయత్నించండి. ఆలోచనలను ఆపడం అంటే అది ప్రవాహానికి ఎదురీదడం లాంటిది. మనస్సును గమనిస్తూ ఉండటం కూడా ఒకరకంగా చూస్తే ప్రవాహానికి ఎదురీదడమే. మీకు ఒక విషయంపట్ల నిజంగా ఆసక్తి కలిగినపుడు లేదా ప్రతికూలమైన ఆలోచనలు వస్తున్నపుడు లేదా కోపం వస్తున్నపుడు మీరు మనస్సును ఎందుకని గమనించలేకపోతున్నారు? మీరు ఆ ఆలోచనలతో ఎందుకని తాదాత్మ్యం చెందుతున్నారు? ఉదాహరణకు మీరు ఒక ధ్యానకేంద్రంలో దాదాపు మూడు నెలలపాటు మీ మనస్సును గమనించడం అభ్యసించి వచ్చారు. కానీ ఎవరైనా మిమ్మల్ని అవమానించిన మరుక్షణం అదంతా అప్పుడే అక్కడే ముగిసిపోతుంది. మీరు మీ ఆలోచనలతో ఒక్కటై కోపోద్రిక్తులవుతారు. అప్పుడు ఏం జరుగుతుంది? మీ ఆలోచనలలోని విషయంపట్ల మీకు ఆసక్తి లేనంతవరకు మీరు వాటిని గమనించగలిగారు. కానీ ఎప్పుడైతే ఆ విషయం మీకు ఆసక్తికరమైనదో, అవసరమైనదో లేదా మీరు పట్టించుకునేదో అయినపుడు మీరు ఆలోచనలతో ఒక్కటవుతారు, ఆపైన మీరిక ఎంత మాత్రమూ ఆలోచనలను గమనించలేరు. ఇది మనస్సు యొక్క సహజలక్షణం.

మీకొచ్చే వెయ్యి ఆలోచనలలో కేవలం అయిదారు ఆలోచనలు మీకు నిజంగా అవసరమైనవో లేదా మీకు సంబంధించినవో అయిఉంటాయి. కానీ వచ్చే ఆలోచనలన్నీ మీ లోపల ఉన్న ఏదో ఒకదానిని వ్యక్తం చేస్తాయి. మీలోని పరిపూర్ణత్వాన్ని అందుకోవాలని ప్రయత్నిస్తుంటాయి. ఆలోచనలు దేనినో అన్వేషిస్తున్నాయి కానీ దానిని అందుకోలేకపోతున్నాయి. ఆలోచన ఒక అలలాంటిది – అది వస్తుంది, పోతుంది, ఒడ్డును ఢీకొట్టి మాయమవుతుంది. మళ్ళీ ఇంకో ఆలోచన వస్తుంది. ఒడ్డును తాకి వెనక్కు వెళ్లి మరో ఆలోచనను రేకెత్తిస్తుంది. ఈ ఆలోచనలు ఎందుకు వస్తున్నాయి? వాటి లక్ష్యం ఏమిటి? అవి దేనికోసం ఉన్నాయి, దేనిని సూచిస్తున్నాయి? నిజంగా ఆలోచనలు మనల్ని బాధిస్తున్నాయా లేదా ఆలోచనలలోని విషయం మనల్ని బాధిస్తోందా?

మీరు సంతోషంగా, ఆనందంగా పారవశ్యమైన స్థితిలో ఉన్నప్పుడు కూడా మీకు ఆలోచనలు వస్తాయి. మీకు ఆనందాన్నిచ్చే విషయం గురించి మీరు ఎంత ఎక్కువగా ఆలోచిస్తూ మీరు అంత



ఆనందభరితులవుతారు. మనం ప్రేమించే వ్యక్తిని గురించి, వస్తువును గురించి ఆలోచించడం మనకు ఆనందాన్నివ్వదా? దీన్నిబట్టి చూస్తేఆలోచనలు మన ఆనందానుభవాన్ని పెంచగలవు. ఒకవేళ ఈ ఆలోచనలు మన ప్రశాంతతను చెడగొడితే, అవి ప్రతికూలమైనవో లేక విచారగ్రస్తమైనవో అయినపుడు మీరు, “నాకు చాలా చాలా ఆలోచనలు వస్తున్నాయి, నిద్రమాత్రవేసుకొని పడుకుంటాను!” అంటారు. నిజానికి ఆలోచనలతో వచ్చిన సమస్యేమీ లేదు, అవి నిరపాయమైనవి, అమాయకమైనవి. వాటిని శత్రువుల్లా చూసి ఎప్పుడూ ఎందుకు వాటితో పోరాడటానికి ప్రయత్నిస్తారు? అవి మిమ్మల్ని ఏం చేసాయి?

మీ ఆలోచనలలోని విషయాన్ని మీరు మీ అన్వేషణాంశంగా ఎందుకు తీసుకోరు? ఎందుకంటే నిజంగా ముఖ్యమైనది ఆలోచనకాదు, ఆలోచనలోని విషయం. ఆ ఆలోచనలోని విషయానికి మీరు ఎలా స్పందిస్తున్నారు అనేదే ముఖ్యం. మీరు ధ్యానంలో కూర్చున్నపుడు మీకు చాలా ఆలోచనలు వస్తాయి. మీరు వాటిని గమనిస్తూ ఉన్నా లేక వాటితో మమేకమైనా, అదేదైనా సరే, మీ ఆలోచనలలోని విషయం ఏమిటి? దాని గురించి ఆలోచించండి. అవి మీలోని భావోద్వేగాలను, మీ ఇష్టాయిష్టాలను, మీ ప్రేమాద్వేషాలను, మీ కోరికలను అవి ప్రతిఫలిస్తాయి. కొన్ని ఆలోచనలు కేవలం అలవాటుగా వస్తాయి. ఈ అలవాట్లు ఎందుకని పునరావృతమవుతూ ఉంటాయి? కొన్నిసార్లు ఒక అలవాటు ప్రకారం సాగడం మనకు ఆనందాన్నిస్తుంది. అందుకే అలవాట్లను పోగొట్టుకోవడం అంత కష్టం. ఏదైనా తక్షణం చెయ్యవలసిన పనిలో లీనమైతే తప్ప మనస్సు అంతకు ముందు జరిగిన ఏదో విషయాన్ని అంటిపెట్టుకొని దానినే నెమరువేసుకుంటూ ఉంటుంది. ఇంకో క్రొత్త సంఘటన – అది ఆనందమైనా, బాధయినా, పొగడ్తయినా తెగడ్తయినా – ఏదో ఒకటి జరిగే వరకు ఈ నెమరివేత కొనసాగి, ఆ తర్వాత అంతకుముందు వరకూ ఉన్న ఆలోచన ఆగి క్రొత్త ఆలోచన మొదలవుతుంది.

నిజానికి ఆలోచనలు మాటలకు మరో రూపాలు. మాటలంటే కేవలం మనం పలికే శబ్దాలు మాత్రమే కాదు, మనం మాట్లాడని మాటలు కూడా ఉంటాయి. మన ఆలోచనలన్నీ అవే. నాటకాలలో రెండు రకాలైన సంభాషణలు ఉంటాయి. మొదటిది పాత్ర ఎదుటివ్యక్తితో మాట్లాడటం, రెండవది తనలో తానే మాట్లాడుకోవడం. మన ఆలోచనలు మనలో మనం మాట్లాడుకోవడం వంటివి. మన ఆలోచనల్లో మనతో మనమే మాట్లాడుకుంటాం. మనిషికి తన ఆలోచనలను వ్యక్తం చేయడానికి

ఎంతటి అవసరం ఉంటుందంటే చుట్టుప్రక్కల ఎవ్వరూ లేకపోతే మనకు మనమే వ్యక్తం చేసుకుంటాం (నవ్వులు...)



**భక్తుడు :** గురువుగారూ! పరిపూర్ణత్వానికి నామంగానీ, రూపంగానీ ఉంటుందా?

**గురువుగారు :** దానికి రూపం ఉంది, ఇప్పుడే మీరు దానికొక 'పరిపూర్ణత్వం' అని నామాన్నిచ్చారు. మీ పరిభాషను బట్టి దానికి మీరు ఏపేరైనా పెట్టవచ్చు. మన భావోద్వేగాలు, అనుభూతులు, ఆలోచనలకు ఓ విధమైన రూపం ఉంటుంది. ఈ రూపాన్నిబట్టే ఒక భావోద్వేగానికి, మరో భావోద్వేగానికి మధ్య వ్యత్యాసాన్ని మనం గుర్తిస్తాం. ఆలోచించండి – ఆనందం, ఈర్ష్య, కోపం, అసంతృప్తి, శాంతి, పరిపూర్ణత్వం – ప్రతిదానికి ప్రత్యేకమైన రూపం ఉంది. వాటికి రూపం లేకపోతే అవి ఒకదానితో ఒకటి కలసిపోయేవి. ఆనందానికి, దుఃఖానికి మధ్య గల తేడాను మీరు ఎలా గుర్తించగలుగుతున్నారు? ఆ రూపం ఎటువంటిది? మీకు ఓర్పు ఉంటే మీరు తెలుసుకోగలుగుతారు. అది మిమ్మల్ని స్థూలం నుండి సూక్ష్మం వైపుకు తీసుకువెళుతుంది. మీరు మాట్లాడేటపుడు ప్రతి శబ్ధానికి దానిదైన స్వీయరూపం ఉంటుంది. ఇంకా లోతుకు వెళితే ప్రతి ఆలోచనకు ఒక రూపం ఉన్న విషయం కనపడుతుంది. ఏ అనుభూతి నుండి, ఏ భావోద్వేగం నుండి ఆలోచన వచ్చింది? దానికి సైతం రూపం ఉంటుంది. ఇలా స్థూలం నుండి సూక్ష్మంవైపుకు వెళ్లడం వలన మనకు సూక్ష్మమైన అంతఃదృష్టి కలిగి మనల్ని మూలానికి తీసుకువెళుతుంది. విపశ్యన అంటే ఇదే.

**భక్తుడు :** గురువుగారూ! మన ఆలోచనలు ఎక్కడ నుండి వస్తున్నాయో ఆ స్థానాన్ని చేరుకోవడం ఎలా?


**గురువుగారు :** దానిగురించే ఇదంతా, మీరు ఇక్కడ కూర్చుని ఉండేది అక్కడకు పోవడానికి కావలసిన టిక్కెట్టు కొనుక్కోవడానికే! (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** టిక్కెట్టు ఎక్కడుంది? మేము ఎక్కడకి వెళ్తాము?

**గురువుగారు :** మీరందరూ ఇక్కడ ఒక ట్రావెల్ ఏజెన్సీలో కూర్చుని ఉన్నారు. మీరు మీ అహంకారం, శ్రద్ధ, ఓర్పు, భక్తి, ప్రేమ వీటన్నింటినీ ఖర్చుపెట్టే అక్కడకు వెళ్లడానికి టిక్కెట్టు కొంటారు. ముందు అక్కడకు పోవడానికి టిక్కెట్టు సంపాదించి, అక్కడకు వెళ్ళి ఆ ప్రదేశానికి అలవాటుపడండి. ఆ తరువాత నేను మీకు నా (ఆ) అడ్రస్ చెప్తాను (నవ్వులు.)

**పూజ భౌతికం నుండి మానసికానికి (మానసిక పూజగా) ఎదగడానికి చేసే ప్రయత్నమే సాధన.**






**భక్తుడు :** గురువుగారూ! మా మార్గాన్ని మమ్మల్నే కనుక్కోమని లేదా ఏర్పరచుకోమని మీరు చెప్పారు. అంటే మేము బుద్ధిపూర్వకంగా అదేమిటో తెలుసుకోవాలా లేక అది అనుక్షణం మేము జీవితాన్ని ఎలా తీసుకుంటామనే దానికి సంబంధించిన విషయమా?

**గురువుగారు :** అది మీరు అనుక్షణం జీవితాన్ని ఎలా తీసుకుంటున్నారనే దానికి సంబంధించినది. అది బుద్ధిపూర్వకమైన ఎంపిక కాదు. అదొక తపనలా, భావోద్వేగపు ప్రతిస్పందనలా ఉంటుంది.

**భక్తుడు :**అంటే, అది ఎప్పుడూ జరుగుతూనే ఉంటుందా?

**గురువుగారు :** అవును, అది ఎప్పుడూ జరుగుతూనే ఉంటుంది.

**భక్తుడు :** గురువుగారూ! మేము కాంక్షించేది కూడా మా అహం వలన అంటే మా ఆలోచనా ధోరణులనుండే రావచ్చునని, అది మా నిజమైన అవసరం కాకపోవచ్చునని, కేవలం ఒక తాత్విక సిద్ధాంతం మాత్రమే కావచ్చునని చెప్పారు.

**గురువుగారు :** కొన్ని సందర్భాలలో అలా కావచ్చు.

**భక్తుడు :** ఈ విషయాన్ని మాకై మేమే తెలుసుకోగలగడం సాధ్యపడుతుందా?

**గురువుగారు :** సాధ్యపడుతుంది. మీ పట్ల మీరు నిజాయితీగా ఉంటే తెలుసుకోగలుగుతారు. దానిని తెలుసుకోవడానికి ఎటువంటి పుస్తకాలూ, బోధనలూ అవసరంలేదు. మనం చేసే పనులే ఆ విషయాన్ని తెలియచేస్తాయి. మీరు, “నాకు ముక్తి కావాలి, నాకు మోక్షం కావాలి, నాకు నిర్వాణం కావాలి, నాకు అపారలౌకికమైన స్థితి కావాలి” అంటారు. ఇటువంటి వాటికి మీ దగ్గర చాలా మంచి మంచి పేర్లున్నాయి. కానీ నిజంగా మీకు దాని అవసరం ఉందా? మీరు నిర్వాణం కోసం అలమటించి పోతున్నారా, తపించిపోతున్నారా? లేకపోతే అది ఒక చక్కని సిద్ధాంతం కాబట్టి మీరు దానిని ఎంచుకున్నారా? ముక్తి, ఆత్మసాక్షాత్కారం, మోక్షం వంటి సిద్ధాంతాలు చాలా బాగుంటాయి. అందులో సందేహం ఏమీలేదు. కానీ మీకు నిజంగా ముక్తి కావాలా?

**భక్తుడు :** కానీ, ఒకవేళ నన్ను నేను ఆ ప్రశ్న వేసుకున్నప్పటికీ, ఆ ప్రశ్న ఒక ఆలోచనాధోరణికి అలవాటుపడిన మనస్సు నుండే వస్తుంది కదా?



**గురువుగారు :** అటువంటి అలవాటును పోగొట్టుకోవడానికేగా నేనిక్కడ ఉన్నది! ఇటువంటి విషయాలు ఆచరణాత్మకంగానూ, మీ అవసరాలకు, సమస్యలకు సంబంధించినవిగానూ, మీ జీవితానికీ, మీ ఉనికికీ అర్ధవంతంగా ఉండాలి. ఏదో ఒక దానిని సిద్ధాంతం బాగుందని దానిని మీకు అన్వయించుకోవద్దు. రమణమహర్షి తామెప్పుడూ ఆత్మసాక్షత్కారం కోరుకోలేదని చెప్పారు – ఆయనకు ఆత్మసాక్షాత్కారం మొదలైన విషయాలగురించి అసలేమీ తెలియదు. ఆయనకో సమస్య వచ్చింది, ఏదో ఒక భావన నిగూఢంగా (మిష్టరీగా) అనిపించింది, ఆయన దానికి సమాధానం తెలుసుకోవాలనుకున్నారు. దానికి సమాధానం కనుగొన్న తరువాత మనం దానిని 'ఆత్మసాక్షాత్కారం' అన్నాం. రమణమహర్షి ఆత్మసాక్షాత్కారం కోసం బయలుదేరలేదు. బుద్ధుని విషయం కూడా ఇంతే బుద్ధుడు నిర్వాణం పొందడానికి రాజభవంతిని విడిచి వెళ్లాడా? కాదు. ఆయన తనకు కలిగిన కొన్ని తీవ్రమైన ప్రశ్నలకు సమాధానాలు అన్వేషిస్తున్నారు. రోగం, ముసలితనం, మరణం – వీటి గురించిన ప్రశ్నలు ఆయన మనసును తొలిచివేసాయి. అవి ఆయనను బయటకు నడిపించాయి. అంతటి తీవ్ర పరితాపం మీకుందా? అప్పుడు బుద్ధునికున్నటువంటి తీవ్రమైన తపనే మీకు ఉండవలసిన అవసరంలేదు. మనుషులకు రకరకాలపరితాపాలు ఉంటాయి. కానీ మిమ్మల్ని పరితాపానికి గురిచేసే ఆ అవసరం ఏమిటి? అదేంటో మీరు తెలుసుకుంటే అప్పుడు మీ అన్వేషణ మీ వ్యక్తిగతమవుతుంది. ప్రతి ఒక్కరికి తమదైన అన్వేషణ, తమదైన మార్గం, తమదైన పద్ధతి ఉంటుంది. దానిమీద దృష్టి పెడితే తప్ప మనం పరిణతిని సాధించలేము. మనందరం మన దారులు మనమే వేసుకుందాం. ఒక వ్యక్తి తన దారిలో అన్వేషణ కొనసాగిస్తే అతను ఒక బుద్ధుడో, ఒక రమణమహర్షో, ఒక సాయిబాబానో కావచ్చు. మహాత్ములు మనకు సాయం చెయ్యవచ్చు. ముందుకు నెట్టవచ్చు, కొన్నిసార్లు మనల్ని తీసుకువెళ్ళవచ్చు కూడా, కానీ అది మనం ఎంచుకున్న దారిలో మాత్రమే. మీ అన్వేషణ పూర్తిగా మీ వ్యక్తిగతమైనదిగా చేసుకొండి. అది మీ స్వంత అవసరాలపై, మీ నిరాశా నిస్పృహలపై, మీ పరిపూర్ణత్వభావనపై ఆధారపడినదిగా ఉండనివ్వండి.

**భక్తుడు :** గురువుగారూ! ముక్తి, మోక్షం లాంటి తాత్విక సిద్ధాంతాలు మా ఆకాంక్షను జాగృతం చెయ్యడానికి సహాయపడతాయి కదా?

**గురువుగారు :** అవును, సహాయపడతాయి. అలా సహాయపడితే మంచిదే. మీ ఆకాంక్ష జాగృతమైన మరుక్షణం అది మీ వ్యక్తిగతమవుతుంది. అది ఒక్కొక్కరికీ ఒక్కో రూపంలో జాగృతమవుతుంది.



అలా అయితే ఈ తాత్విక సిద్ధాంతాలు ఉపయోగపడతాయి. కానీ సమస్యేమిటంటే అవి మిమ్మల్ని నిస్తేజంగా, యాంత్రికంగా, ఒకే మూసలో ఆలోచించేటట్లుగా చేస్తాయి. కొంతమంది వారికి ఈ తాత్విక సిద్ధాంతాలు అర్థమైనట్లు, వాళ్ళకి వాళ్ళ లక్ష్యమేమిటో తెలిసినట్లుగా భావించి, వారు దానిని సాధించాలని కోరుకుంటారు. కానీ వాస్తవానికి వాళ్ళు వేరొకరి వ్యక్తిగత లక్ష్యాన్ని సాధించడానికి ప్రయత్నిస్తున్నారు. బుద్ధునికి తనదైన ఒక వ్యక్తిగత లక్ష్యం ఉంది. ఆ లక్ష్యం మీది కానప్పుడు, దానిని సాధించడానికి మీరెందుకు ప్రయత్నించాలి? మరణానుభవం కలిగినప్పుడు రమణమహర్షి, తనెవరో తెలుసుకోవాలని, తన అస్తిత్వమేమిటో (గుర్తింపు ఏమిటో) తెలుసుకోవాలని అనుకున్నారు. మీ అస్తిత్వం గురించి మీరు అంత తపన పడుతున్నారా? మీరెవరో తెలుసుకోవాలని మీరు నిజంగా కోరుకుంటున్నారా? ఆ ప్రశ్న అంత ప్రబలంగా మారి మిమ్మల్ని మీ ఇంట్లో నిలువనీయకుండా ఇంటినుంచి పారిపోయేలా చేస్తోందా? కాదు. మీకు అది అంతటి సమస్య కాదు. కానీ మీరు రమణమహర్షికి వ్యక్తిగతమైన సమస్యను మీదిగా చేసుకొని ఆయనను అనుకరిస్తూ దానిని పరిష్కరించుకోవాలని ప్రయత్నిస్తున్నారు. మీరు పరిష్కరించలేరు! ఆత్మవిచారణ తప్పని నేను చెప్పడంలేదు. కానీ ఆ విచారణను మీ అసలైన వ్యక్తిగత అవసరాలమీద, మీకున్న పరిపూర్ణత్వభావన మీద ఆధారపడినదిగా ఉండనివ్వండి. అస్పష్టంగా ఉన్న మీ పరిపూర్ణత్వ భావనను ముఖాముఖి ఎదుర్కొండి. మీ స్వంత పద్ధతిలో వాస్తవం చేసుకోవడానికి ప్రయత్నించండి.

**గురువుగారు :** మీకు పూర్తిగా అర్థంకాని, అవగాహన లేని నిగూఢమైన తాత్విక భావనలేవో ఉంచుకుని, మీకు ఏ రకంగానూ ఉపయుక్తం కానటువంటి తాత్విక సిద్ధాంతాలను అంటి పెట్టుకోవడానికి చేసే ప్రయత్నంలో మీ జీవితమంతా వృధా అవుతుంది. ఒక నిగూఢమైన భావన మనలో ఎప్పుడూ ఉంటుంది. కానీ అది మన ప్రత్యక్షానుభవం కావాలి. ఒక వ్యక్తికి ఒక విషయం అర్థవంతంగా ఉండవచ్చు. కానీ అది మీకు ఉపయుక్తంగా ఉందా అనే విషయం గురించి మీరు ఆలోచించాలి.

**భక్తుడు :** ఆ నిగూఢతత్త్వాన్ని ప్రత్యక్షంగా అనుభూతి చెందాలన్నారు – అంటే?

**గురువుగారు :** అది మీ వ్యక్తిగత సమస్య అయి వుండాలి. అలా కాకుండా అది ఒక బుద్ధిపూర్వకమైన ప్రశ్నో లేక ప్రయత్నమో కాకూడదు. అదేదో చెయ్యవలసినదో లేదా చెయ్యక తప్పనిదో కాకూడదు. ఉదాహరణకు మీకు ఉపనిషత్తులు ఏమీ అర్థం కావడంలేదు, అది మీకు గ్రీకు, లాటిన్‌భాష లాగా అనిపిస్తోంది. అయినా మీరు వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తూ, ఆ అర్థం మీకు అర్థవంతంగా



ఉండేలా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఒకవేళ మీరు ఈ ప్రయత్నంలో సఫలీకృతం కాకపోతే మీరు వాటిని అర్థవంతం చెయ్యడానికి చెయ్యాల్సిన ప్రతి ప్రయత్నం చేస్తారు. ఒకవేళ అది మీకు నిజంగా అర్థవంతమైనదే అయితే అది మెరుపులా మీకు తడుతుంది. మీరు ప్రయత్నించాల్సిన అవసరంలేదు. బుద్ధునికి తన జీవితపు నిగూఢతత్వం, సమస్త విశ్వంలోని నిగూఢతత్వం ఎలా ఉన్నట్టుండి తేటతెల్లమయిందో చూడండి. ప్రతి ఒక్కరూ అలాంటి పరిస్థితినే ఎదుర్కోవాలని లేదు. అది వ్యక్తికి వ్యక్తికి మారుతుంది. జీవితం యొక్క నిగూఢతత్వం (మిస్టరీ), రోగం, ముసలితనం, మరణం ఇలాంటి విషయాలలోని నిగూఢత... ఇవీ బుద్ధుడు ఆలోచించిన విషయాలు. ఇవి ఆయనకు తన వ్యక్తిగత సమస్యలు. కానీ ఈ రకమైన సమస్యలు మనకంత ముఖ్యం కాదు. మనం, "ఇవన్నీ ఏం సమస్యలు, మాకివి ఎప్పుడో అర్థమయ్యాయి, చాలా స్పష్టమైన విషయాలివి" అని అంటాము. అవి మనల్ని నిజంగా అలజడికి లోనుచేసే సమస్యలు కాదు. కానీ బుద్ధునికి అవి చాలా వ్యక్తిగతమైన సమస్యలు. ఆ నిగూఢతత్వాన్ని పరిష్కరించడం పట్ల బుద్ధునికి గలప్రీతి, ఆయన ప్రేమ ఆయన అన్వేషణను పురికొల్పాయి.

**గురువుగారు :** నా చిన్నతనంలో నేను చూసిన ప్రతిదీ నాకు చిక్కుప్రశ్నగా మారేది. "నేను శ్వాస తీసుకుంటున్నప్పుడు, నేను ఆలోచిస్తున్నప్పుడు, నేను దేనినైనా చూస్తున్నప్పుడు ఏం జరుగుతోంది? నేను ఎందుకు చూడగలుగుతున్నాను? నేను దేనిని చూస్తున్నాను? నిజానికి నేను చూసినట్లే అది ఉందా? ఎవరన్నా మాట్లాడుతుంటే నేను ఎలా వినగలుగుతున్నాను? అసలు ఏం జరుగుతోంది ఇక్కడ?..." ఇలా ఇవన్నీ నన్ను తీవ్రమైన అలజడికి గురిచేసేవి. ఎంతగా అంటే వీటివల్ల నాకు కొన్నిసార్లు ఏడుపొచ్చేది. అది నాకు చాలా వ్యక్తిగతమైన సమస్యయింది. "ఇంత చిన్న విషయానికా? అది చాలా స్పష్టంగా తెలుస్తుంది కదా? దీని కోసం ఎవరైనా ఎందుకు ఏడవాలి?" అనుకోవచ్చు. మీకు నవ్వు రావచ్చు. కానీ నేను ఏడిచేవాణ్ణి! నేను దేనినీ సంతోషంగా ఆస్వాదించలేకపోయేవాడిని. ప్రతిదీ నాకు నిస్సారంగా అనిపించేది. కారణమేమిటంటే నాకు ఏదీ అర్థమయ్యేది కాదు. ఆ స్థితిని నేనిప్పుడు సరిగా వర్ణించలేకపోవచ్చు. కానీ అప్పుడది నాకు సమస్యని నాకు తెలుసు. నాకు మరే ఇతర సమస్యలు లేవు. నాకు శాస్త్రాలపట్ల, గ్రంధాలపట్ల, దేవుళ్ళ పట్ల, దేవతలపట్ల, సంప్రదాయం పట్ల ఎటువంటి ఆసక్తి లేదు. నేను ఎప్పుడూ నాకున్న ఈ సమస్యతోనే సతమతమయ్యేవాడిని.



నాలాగా ఎవ్వరికీ అనిపించకపోవడం వల్ల వాళ్ళందరికీ ఈ విషయాలన్నీ తెలుసనుకునేవాడిని. “బహుశా వాళ్లందరికీ ఆ మర్మం తెలుసేమో” అనుకునేవాడిని, అంతమంది జ్ఞానులమధ్య నేను ఒక్కడినే అజ్ఞానిననీ, మూర్ఖుడిననీ అనిపించేది. ఎందుకంటే వారికి ఆ జ్ఞానం లేకపోతే వారందరికీ ఇది ఒక సమస్య అయి ఉండాలికదా? (గురువుగారు నవ్వుతూ...) నేను చెప్పేది నేను చిన్నపిల్లవాడిగా ఉన్నప్పటి సంగతి.

**భక్తుడు :** ఆ పరిస్థితి ఎలా మారింది?

**గురువుగారు:** నేను నా గురువును కలుసుకున్న తరువాత, ఈ సమస్యను సరిగా అర్థం చేసుకోవడానికి, దానిని ఎదుర్కొనే దానికి ఒక పద్ధతిని అనుసరించాను. నిజానికి నేను ఆ మార్గాన్ని అనుసరించడం కాదు – ఒక మార్గాన్ని ఎలా తయారుచేసుకోవాలో కనుక్కొన్నాను. నా ముందు ఏ మార్గమూ లేదు. అంతా చెట్లూ, చేమలు, గడ్డి, ముళ్ళూ, పొదలే. దానిని దాటడానికి నా దారిని నేనే వేసుకోవలసి వచ్చింది.

**భక్తుడు :** గురువుగారూ! కేవలం ప్రశ్నించడం ద్వారా ఆ నిగూఢతత్వాన్ని (మిష్టరీని) ఛేదించలేమనిపిస్తోంది.

**గురువుగారు :** అదేం లేదు. ప్రశ్నించండి. అందువల్ల ఇబ్బందేమీ లేదు. కేవలం ప్రశ్నించడం ద్వారా, సమాధానాలు పొందడం ద్వారా మీరు ఆ మిష్టరీని ఛేదించగలమనే భ్రమల్లో ఉండవద్దు. ఎందుకంటే ఆ నిగూఢతత్వం (మిష్టరీ) అనేది ఒక అనుభవం. అది బోర్డుమీద వ్రాసిన గణిత సమీకరణం కాదు. ఆ నిగూఢతత్వ భావన ఒక అనుభవం. కాబట్టి దానికి పరిష్కారం కూడా ఒక అనుభవమే కావాలి.

చాలామంది విచారణ (ఆత్మవిచారం) గురించి మాట్లాడుతుంటారు. కొందరు, “మీరెవరో తెలుసుకోండి” అంటారు. ఆ తరువాత వాక్యంలోనే “మీరు బ్రహ్మం, మీరే ‘నేను’, ఆ ‘నేనే’ ఆత్మ, ఆత్మే బ్రహ్మం” అని చెప్పేస్తారు. మీరే అంతటా ఉన్న ‘నేను’ అని, ఆ నేనే బ్రహ్మం అని మీరు అంతిమంగా విచారణ పూర్తయ్యాక తెలుసుకోవాలి. ఇలా ముందే సమాధానం వచ్చేసింది. ఇక అదేం విచారణ? కొంతమంది విచారణ యొక్క అసలు ఉద్దేశ్యమేమిటో అర్థం చేసుకోలేక వారు అందులో ముందుకుపోలేకున్నారు. సిద్ధాంతరీత్యా ముందే వారికి సమాధానం తెలుసు. ఎందుకంటే



వారి ప్రశ్న కూడా సిద్ధాంతపరంగానే ఉంటుంది. ప్రశ్నగానీ సమాధానంగానీ ఏదీ వారి అనుభవంలో నుంచి వచ్చినవి కాదు. వాస్తవంగా చెప్పాలంటే 'మీరెవరు' అనేదాని పట్ల ఎవ్వరికీ ఎటువంటి సందేహాలు ఉండవు – మీకు నిజంగా మీరెవరు అనే గుర్తింపు విషయంలో సందేహాలున్నాయా? మనకు ఆ విషయం చాలా ఖచ్చితంగా తెలుసు. నిజానికి మన జీవితమంతా 'మనమంటే ఫలానా' అనే గుర్తింపును సాధించడం కోసమే కదా. (గురువుగారు నవ్వుతూ) తమ గుర్తింపు (అస్తిత్వం) పట్ల కేవలం నోటిమాటగా కాకుండా నిజంగా అనుభవపూర్వకమైన సందేహం ఉన్నవారికి ఈ మిష్టరీ, విచారణ రెండూ అనుభవపూర్వకంగానే ఉంటాయి. అప్పుడు వారికి సమాధానం కూడా అనుభవపూర్వకంగానే వస్తుంది. ఈ విచారణ గురించి మనం ఎంత ఎక్కువగా వింటామో అంతమేర మన విచారణ పట్ల జిజ్ఞాస కుంటుపడుతుంది. ఈ మాటలు మనల్ని మిష్టరీని లేదా దాని పరిష్కారాన్ని అనుభవం రూపంలో పొందకుండా అడ్డుపడతాయి. అందుకనే ఇటువంటి వాటి గురించి నేను ఎక్కువగా మాట్లాడను. అలా చేస్తే మీకు నేను సహాయాన్ని అందివ్వని వాడినవుతాను.

ఇలా మీరు వీటి గురించి కొంతకాలం మాట్లాడి, సిద్ధాంతీకరించిన తరువాత మీరు, "నేనే ఆ బ్రహ్మాన్ని" అంటారు. "మీ పేరేమిటి?" అంటే "ఆత్మ" అంటారు. (నవ్వులు...) ఈ మాటలు నేను హాస్యం కోసం చెప్పడంలేదు. పుణ్యక్షేత్రాలలో మీరు కొన్నిసార్లు ఇలాంటి వారి వద్ద ఇటువంటి మాటలు వినవచ్చు. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు :** గురువుగారూ! మీరు నిన్న సత్సంగంలో ఆనందాన్ని కనుగొనడం గురించి చెప్పారు. అంటే మీ ఉద్దేశ్యం అప్పటికే ఉన్నదాని మీద గలతెరలు తొలగించడమా? అలా అయితే, మన స్వభావం ఆనందం అని చెప్పడం సరైనదేనా?

**గురువుగారు :** ఆ విషయాన్ని మీరే కనుక్కోండి. మీరు నన్ను సమాధానం చెప్పమని అడుగుతున్నారు. కానీ నేను ఆ సమాధానాన్ని మిమ్మల్నే కనుక్కోమని చెబుతున్నాను. నేను సమాధానం చెప్పితే ఇక మీరు కనుక్కునేదేముంది? అక్కడ ఉండేదేమిటో కనుక్కోండి. అది ఆనందమా, దుఃఖమా అదేదైనా సరే. బహుశా మీ స్వభావం దుఃఖం కావచ్చు. ఎవరికి తెలుసు? (గురువుగారు నవ్వుతూ....) దానిని కనుక్కునేదానికి ప్రయత్నించండి.

**భక్తుడు :** కానీ మీరది ఆనందమని చెప్పారు!



**గురువుగారు :** నేను నా అనుభవం చెప్పాను. మీకు మరొకటి అనుభవం కావచ్చు, ఎవరికి తెలుసు? నేను మీలో ఒక నిగూఢతత్వ భావనను కలిగించడానికి ప్రయత్నిస్తున్నాను. నేను మీకు సమాధానాలు చెప్పాలనుకోవడంలేదు. ఎందుకంటే సమాధానాలు చెప్తే నేను మీ కుతూహలాన్ని, మీ అన్వేషణను, మీకున్న ఆ నిగూఢతత్వ భావనను నాశనం చేసినట్లవుతుంది. అందుకే రెడీమేడ్ సమాధానాలను అంగీకరించకండి. మీకై మీరే తెలుసుకోవడానికి ప్రయత్నించండి.

**గురువుగారు :** మీరు ఎలా ఆలోచించగలుగుతున్నారు. ఎలా చూడగలుగుతున్నారు. ఎలా మాట్లాడగలుగుతున్నారు. ఎలా నిద్రపోతున్నారు. ఎలా మేల్కొంటున్నారు? మీ ఎరుకను వదులుకొని మళ్ళీ మీరు ఉదయాన్నే నిద్రలేస్తారనే భరోసా ఏదీ లేకుండా ధైర్యంగా ఎలా నిద్రపోగలుగుతున్నారు? (గురువుగారు నవ్వుతూ...) మీరు నన్ను ఎలా చూస్తున్నారు? నాతో ఎలా మాట్లాడగలుగుతున్నారు? ఈ భావోద్వేగాలు ఏమిటి? అసలేమిటిదంతా? ఈ ప్రశ్నలు మీలో ఉత్కంఠను కలిగించడం లేదా? ఇదో గొప్ప నాటకంలాగా లేదా? మీరు దేనినీ ఊహించు కోవాల్సిన అవసరంలేదు. ఏ తాత్విక సిద్ధాంతాన్నో ఆపాదించుకోవాల్సిన అవసరంలేదు – వాస్తవాన్ని చూడండి, అందులోని రమణీయత అర్ధమవుతుంది. మీరు ఆ థ్రిల్‌ను (ఉత్తేజాన్ని) అనుభవించగలుగుతారు. మీ జీవితం యావత్తూ ఒక గొప్ప థ్రిల్లర్, అన్ని థ్రిల్లర్స్ (ఉత్కంఠతో కూడినవి) కన్నా చాలా గొప్పది. చాలామంది జీవితంలో ఉత్తేజాన్ని (థ్రిల్‌ను) అనుభవించా లనుకుంటారు. ఆ ఉత్తేజానికి ఎంతగా బానిసలవుతారంటే ఆ ఉత్తేజాన్ని ఇచ్చేవాటిని ఎక్కువ మోతాదుల్లో తీసుకోవాలనుకుంటారు. కొందరు థ్రిల్లర్ పుస్తకాలను చదువుతారు. మరికొందరు జీవితాన్ని ఇంకా ఇంకా ఒక మిస్టరీలాగ చేసుకోవడానికి ప్రయత్నిస్తారు. నిజానికి ఆ మిస్టరీ ఇక్కడే, మీ చేతుల్లోనే ఉంది. మీరు దానిని ఛేదించారా? అసలు ఆ మిస్టరీ ఏమిటో మీరు తెలుసుకున్నారా, లేదా అన్నది ముఖ్యంకాదు, మీరు దానిని గుర్తించారన్న విషయం, మీరు దానిలోనే జీవిస్తున్నారనే విషయం నిజంగా చాలా ఉత్తేజభరితంగా (థ్రిల్లింగ్‌గా) రసాత్మకంగా ఉంటుంది. ఆ మిస్టరీకి పరిష్కారం నన్నడిగితే, నేను చెప్పను. సినిమాలో ఫలానా వ్యక్తి విలన్, ఫలానా వ్యక్తి హంతకుడు అని ముందే చెప్పరు కదా. నేను కూడా అలాగే చివరిలో ఏం జరుగబోతోందో ముందే చెప్పను. మీరు సినిమా చూడాలి, నేను మీకు కథ ముందుగానే చెప్పను. నిజంగా మిస్టరీని ఇష్టపడే వాళ్ళు, ఆ మిస్టరీని (చివరిదాకా) అనుభూతి చెందాలని, ఆ థ్రిల్‌ను పొందాలని అనుకుంటారు.

# గురుకృపాలహరి



**'నిజమైన మహాత్ముని జీవితము, వారి ద్వారా జరిగే లోకహిత కార్యము కూడా నిత్యసత్యాలే. వాటికి ఆది–అంతమూ రెండూ ఉండవు" అంటారు శ్రీబాబూజీ.** అలానే మన కథానాయకుడు 'స్వామినాథన్' జీవితానికి కూడా మనం ఒక చక్కటి కూర్పును ఏర్పరచలేము కానీ, 'స్వామి'నాథన్‌తో మన ప్రయాణంలోని ప్రతి మజిలీ మహోన్నతమే. ఉద్వేగాన్నీ, ఉత్సాహాన్నీ, ఉత్సుకతను రేకెత్తించి చిత్త చాంచల్యాన్ని వదిలించి – మనశ్శాంతిని కల్గించి – మనో మాలిన్యాన్ని తొలగించి – సద్గురుపథంలో సూటిగా సాగిపోయేందుకు దోహదం చేస్తుందని మాత్రం చెప్పవచ్చు. ఎందుకంటే వారి జీవితంలో ఆదర్శం ఉంది– ఆడంబరం లేదు. ప్రేమ ఉంది– చమత్కారం లేదు. కరుణ నిండింది–కల్మషం జాడలేదు. భగవద్విశ్వాసం ఉంది – భేషజం లేదు, విశేషమైన ప్రతిభ ఉంది – వాగాడంబరం లేదు, 'హరిజనం' లేరు – 'జనం' హరిని చేరాలన్న తపన ఉంది. నిర్హేతుకమైన వారి గురుదేవుల కృపా కటాక్షవీక్షణం ఒకవైపు, ప్రతి మనిషి మనసులోనూ భగవంతుని ఉనికిని పాదుకొల్పాలన్న వారి ఆశయసాధన ఒకవైపు దర్శనమిస్తాయి. మరలిపోతున్న మనస్సును మళ్ళీ కథలోకి తీసుకొద్దాం.

ముద్దులొలికే గారాలబాబు స్వామినాథన్ మాటలకు కుటుంబంలోని వారేకాక చుట్టుప్రక్కల వాళ్ళు కూడా పొంగిపోయేవారు. ఆయన మాటలు చిలకపలుకుల వలే ఉండేవి కనుక అతనిని ముద్దుగా 'గిని' అని పిలుచుకునేవారు. కన్నడ భాషలో **'గిని'** అంటే **'పంచవన్నెల చిలుక'** అని అర్థం. మహాత్ముల జీవిత విశేషాలను గమనిస్తే కొన్ని సంఘటనల వెనుక ఆంతర్యమేమిటో – అవి ఎందుకు జరిగాయో మానవ మేధస్సుకు అందవు. అందుకే అన్నారేమో బాబా "నా చర్యలు అగాధాలు" అని. ముద్దులొలికే స్వామినాథన్ మూడవయేట జరిగిన ఓ సంఘటన – సుబ్రహ్మణ్యంగారింటి ప్రక్కనే ఉన్న ఇంటిలో చీకటి వేళలో ఏదో ఒక అలజడి ప్రారంభమయింది. మొదట ఏదో ఒక్కొక్క గిన్నెను సర్దుతున్నట్లు ప్రారంభమయిన అలజడి మెల్లగా పెరుగుతుండటంతో దొంగలు ఇంట్లో చేరారని అనుకున్నారు ఆ వీధిజనులు. ఆ ఇంటివారంతా ఊరు వెళ్లడంతో తాళం వేసి ఉంది. కానీ క్రమేపీ పెరుగుతున్న శబ్దంతో దొంగలు కాదని – ఏదో ఓ విచిత్ర స్థితి ఏర్పడిందన్న ఒక నిర్ణయానికొచ్చి తలుపులు పగలగొట్టారు స్థానికులు. ఇంట్లో వాళ్ళు ఊరు వెళుతూ తీపి పానకం చేసుకొని పాత్ర శుభ్రం చేయకుండా వెళ్లడంతో ఒక పిల్లి ఆ పాత్రలో తలపెట్టి ఆ తీపినంతా ఆస్వాదించింది. అయితే తలను మాత్రం పాత్రనుండి బయటకు తీయలేకపోయింది. సరే! స్థానికులు కష్టించి పిల్లిని – పాత్రను విడదీసారు. తర్వాత ఇళ్ళు చేరి

**సంప్రదాయం అంటే ముందు తరాలను అనుకరించడం కాదు. వారి అనుభవం నుండి నేర్చుకోవడం**



నిద్రించారు. ఈ పరిస్థితి విన్న మూడేళ్ళ బాలుడు ఎవరైనా నవ్వుల పర్యంతమవుతారు. కానీ స్వామినాథన్ భిన్నంగా "అయ్యో! పుట్టిన ప్రతి మానవుడు ఆశామోహమనే బిగుతు పాత్రలో చిక్కి బయటకు రాలేక విలవిలలాడుతున్నాడే" అన్న నిర్వేదాన్ని వ్యక్తం చేసాడు. చిన్ననాటి ఆ భావనను గుర్తుచేసుకుంటూ తమ 70వ దశకములో ఒక సత్సంగంలో కొన్ని క్షణాలు మౌనముద్రాంకితులయ్యారు పరమాచార్యులు. ఇలా వారు సభాముఖంగా ఈ సంఘటనను అందరితో పంచుకున్నారో లేదో మరలా ఆ సంఘటన వారు విడిది చేసినచోట పునరావృతమయ్యింది. స్వామితోపాటు విడిదిలో ఉన్న అంతేవాసులు గిన్నెలకు మరమూతలు బిగిస్తే సరిపోతుంది అంటే – స్వామివారు పెద్ద పాత్రలలో పదార్ధాలను ఉంచండయ్యా! మూగజీవులకు ఆహార సేవనానికి ఇబ్బంది కలుగదు అన్నారు. **మహాత్మునికి సమీపంగా ఉంటే సరిపోతుందా? సజ్జన హృదయాలను సభక్తి పూర్వకంగా అవగతం చేసుకోవడానికి ప్రయత్నించాలి, విశ్లేషించుకోవాలి, రాజీలేని జీవిత విధానాన్ని అలవరచుకోవాలి**. పువ్వు పుట్టగానే పరిమళిస్తుందన్న నానుడి ఉండనే ఉంది కదా! దానికి ప్రతీక ఇది. మూడేళ్ళ బాలుడిగానే 'స్వామి'నాథన్‌లో ఉన్న సౌశీల్యమిది. ఇలాంటి సంఘటనలే మా గురుదేవుల విషయంలోనూ లీలగా గుర్తొస్తున్నాయి. అతి చిన్న వయసులోనే గురుదేవులకు తిరుమల మూలవిరాట్‌వద్ద ఒక యోగి పుంగవుడు వారిని పిలుస్తున్నట్లుగా మరియు ఇంకో సందర్భంలో తాము ఒంటరిగా ఉన్న సమయంలో "దిక్కులేనివారికి దేవుడే దిక్కు" అంటూ తమలో తాము అతి చిన్న వయసులోనే తర్కించుకోవడం. చిన్న వయసులోనే మహాత్ములు వారిలోని దైవీ గుణాలను, సంతు భావాలను వ్యక్తం చేయడం కద్దు.

మానవాళి శ్రేయోద్ధరణ కోసం భువిపై అవతరించిన దైవం – మానవ రూపంలో ఉండి ఒకానొక వ్యక్తావ్యక్త స్థితిలో ఒక్కోసారి అలా అసంకల్పితంగా వ్యక్తమవుతారా? ఏమో? సర్వాన్నీ భగవన్మయంగా దర్శించగలిగిన సమున్నత స్థితిలో వారు! వారి స్వరూపాన్ని అవగతం చేసుకోలేని సామాన్య మానవులం మనం... తరచి చూసుకుందాం...

"త్యాగైనేక అమృతత్వ మానుషః" అంటుంది వేదం. మనిషిని అమృతతుల్యునిగా చేయగలిగింది కేవలం త్యాగం మాత్రమే. జాతిహితమనే ఒక మహోన్నత యజ్ఞం నిరాటంకంగా జరిగి ఆ యజ్ఞ ఫలాలు అందరికీ అందాలి అంటే 'గురు'తర బాధ్యతను స్వీకరించిన వ్యక్తులు, వారి తల్లిదండ్రులు, వారి అనుయాయులు, వారి ప్రేమికులు... మరెందరో వ్యక్తుల ప్రేమలు, వారి వ్యక్తిగతాలు

సమిధలవ్వాల్సిందే! 'స్వామి'నాథన్ తల్లిగారికి వారిపై ఉన్న వాత్సల్యం, తదుపరి పరిణామాలు క్రోడీకరించుకుంటే పై మాటల్లోని ఆంతర్యం అర్థమవుతుంది.



1899లో సుబ్రహ్మణ్యంగారు పోర్టునోవాలో ఉపాధ్యాయులుగా ఉన్నారు. చిదంబర క్షేత్రంలో ఒక విశేషమైన కుంబాభిషేకం జరుగుతుంది ఈశ్వరునికి. ఆ శివరాత్రి ఉత్సవానికని 'గిని'తో కలిసివెళ్ళారు సుబ్రహ్మణ్యంగారు. వెంకటరామయ్యరు ఇంట విడిది చేసి "నీవు నిద్రపో! అభిషేకానికి నిన్ను లేపి తీసుకువెళతాను" అని చెప్పి తనని ఉత్సవానికి తీసుకువెళ్లలేదు. ఈశ్వర సంకల్పమలా ఉంది. ఆరోజు రాత్రి ఆలయంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఎందరో భక్తులు విగతజీవులయ్యారు. మొదట ఆశాభంగమయినా తండ్రి చెప్పిన అగ్ని ప్రమాద ఘటన విని సమాధాన పడ్డాడు 'గిని'. ఇదిలా ఉంటే అదేరోజు రాత్రి తల్లిగారైన మహలక్ష్మమ్మగారికి స్వప్నంలో చిదంబరంలో పెద్ద అగ్ని ప్రమాదం జరిగినట్లు కల వచ్చింది. తెల్లవారే వరకు భగవన్నామం చెప్పుకుంటూ గడిపారు. చిదంబరం నుండి వచ్చేవారిని విచారిద్దామని రైల్వేస్టేషన్‌కు వెళ్ళారు మహాలక్ష్మమ్మగారు. రైల్వేస్టేషన్‌లో సురక్షితంగా వెనుదిరిగి వస్తున్న తండ్రీకొడుకులను చూసి మహలక్ష్మమ్మగారి ఆనందానికి అవధులు లేవు. బిడ్డపై తల్లికుండే ప్రేమ మాటల్లో వస్తుందా? "ఈరోజు మొదలు ఇంకెన్నడూ నిన్ను వదలి నేను ఉండలేను, కనీసం నిన్ను మీ నాన్నతో కూడా ఒంటరిగా వెళ్లనివ్వను" అన్న ఆ తల్లి మాటలు మాత్రం మన స్మృతి పథంలో నిలుపుకుందాం. ఇంకోచోట ప్రస్తావించుకుందాం ఈ అంశాన్ని.

ఇక మన చిన్నారి 'గిని' విద్యాభ్యాసాన్ని గమనిద్దాం. 'గిని' తన మొదట తరగతిలోనే తన ప్రతిభా పాటవాలను నిరూపించుకున్నాడు. 1900వ సం॥లో అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ మొదలియార్‌గారు స్కూల్‌కు తనిఖీ నిమిత్తమై వచ్చారు. ఇంగ్లీషు వాచకమునిచ్చి చదవమన్నారు ఆయన. అది పై తరగతి పుస్తకం. కానీ అదురు, బెదురూ లేకుండా చదివిన 'గిని'ని చూసి తనను మూడవతరగతికి పంపారు. పిల్లవాడి తండ్రి తనతో ఇతఃపూర్వం తన క్రింద పనిచేసిన సుబ్రహ్మణ్యం తనయుడని తెలిసి తండ్రిని పిలిచి అభినందించారు మొదలియారు. ఏదో ఒకరోజుకు మీ కుమారుడు గొప్పవాడవుతాడంటే ఆ తండ్రి ఆనందానికి ఎల్లలు లేవు. తనను మించిన జిల్లా విద్యాధికారిలాంటి ఉన్నత పదవులను అలంకరిస్తాడనుకున్నారు సుబ్రహ్మణ్యంగారు. సంస్కృతము నేర్చుకునే అవకాశం రాలేదు కానీ, 'గిని' అన్ని క్లాసులలోనూ ప్రతిభావంతునిగా ఉండేవాడు. చివరకు వారు చదివింది మిషనరీ స్కూలులో కనుక బైబిల్ కంఠస్థంలోనూ వారిదే ప్రతిభాస్థానం. క్రైస్తవ ఉపాధ్యాయులంతా

**ప్రతిదాన్నిఉన్నది ఉన్నట్లుగానే చూడటమే నిజమైన దార్శనికత.**



'గిని' అంటే ఒక ప్రత్యేక అభిమానాన్ని చూపేవారు. 'గిని' తన చతురోక్తులతో కూడిన హాస్యానికి, సమయస్ఫూర్తికి, ఒక్కమాటతోనే పలు అర్థాలు చెపుతూ అందరినీ ఆకర్షించడానికి మారుపేరు.

'గిని' 1906వ సం॥ తన నాల్గువఫారం చదువుతుండగా స్కూలులోని పై తరగతి పిల్లలు షేక్స్పియర్ రాసిన 'కింగ్‌జాన్' నాటకం ప్రదర్శించడానికి ఉద్యుక్తులయ్యారు. అందులో ప్రిన్స్ ఆర్థర్ పాత్రను వేయడానికి ఎవరూ దొరకలేదు. కళాశాల ప్రిన్సిపాల్ వారికి 12 ఏళ్ళ స్వామినాథన్‌ను సిఫార్సు చేసారు. అతని చిన్న వయసును దృష్టిలో ఉంచుకొని క్లాస్ టీచర్, స్వతహాగా సదాచార కుటుంబీకులైన తల్లిదండ్రులు మొదట కాదన్నా – 'గిని'లోని ఉత్సాహాన్ని, ప్రతిభను చూసి సరేనన్నారు. కేవలం రెండురోజుల్లోనే ప్రిన్స్ ఆర్థర్ పాత్రలోని ప్రతీ భావాన్ని, ప్రతి సంభాషణను అత్యద్భుతంగా ప్రదర్శించి అందరి మన్ననలు పొందాడు గిని. అంతేకాదు తన ప్రతిభకు ప్రథమ పురస్కారం కూడా లభించింది. గిని ప్రతిభను చూసి తర్వాత రోజు ఉపాధ్యాయలు వారింటికి వెళ్లి వాళ్ళ నాన్నగారిని అభినందించారు. **యువరాజు పాత్రలో ప్రభవించిన ఈ చిన్నారి రాబోయే కాలంలో ఆర్షధర్మాన్ని, భగవంతుని ఉనికిని, ఆదర్శాలను, ఒక గొప్ప జీవన విధానాన్ని, భరతజాతికి అందించబోయే క్షాత్రం పట్టని యోగి మహరాజుగా విలసిల్లుతాడని ఎవరికి తెలుసు. దీనికి కాలమే నిర్ణేత – ఈశ్వరుడు అభయప్రదాత.**

1905వ సం॥లో ఉద్యోగరీత్యా సుబ్రహ్మణ్యంగారికి తిండివనం బదిలీ అయింది. ఆ సం॥లోనే 'గిని'కి ఉపనయనమయింది. ఆ సమయంలో కంచి పీఠాధిపత్యం వహిస్తున్న పూజ్య ఆచార్యులు శ్రీచంద్రశేఖర సరస్వతీ స్వామివారు ఆర్కాటులో విడిది చేసి ఉన్నారు. వారు 'గిని'కి ఆశీస్సులను అందచేసారు. 1906వ సం॥లో చంద్రశేఖర సరస్వతీ స్వామివారు తిండివనం సమీపంలోని పెరుముక్కల్‌లో విడిది చేసి ఉండగా కుటుంబ పరివారంగా సుబ్రహ్మణ్యంగారు ఆ మహాపురుషుని దర్శించగలిగారు. అది 'గిని'కి శ్రీ స్వామివారితో మొదటి కలయిక. సదాచార కుటుంబ నేపథ్యం ఓ వంక – మిషనరీ విద్యావిధానంలో చివరకు బైబిలుతో సహా కంఠస్థంగా సాగుతున్న నాగరిక నేపథ్యమున్న 'గిని' అనే చిన్నారి 'నెల'వంక. మొదలు గురువనే భూమి 'నీడ'గా సాగి – శిష్యుడు చిన్న నెలవంకలా దర్శన మిస్తాడు. కాలగమనంలో గురు అనుగ్రహ'పూర్ణ'మైన శిష్యుడు తాను అందరిలో కొలువై ఉన్న తన గురుస్వరూపమని తెలిసి పూర్ణచంద్రునిలా భాసిస్తాడు. పాఠకులారా! అసలు విషయానికొస్తాను. నా ఈ తపనంతా 'గిని'కి తన ప్రథమ సద్గురు దర్శనమయిన క్షణాల



గురించి వర్ణిద్దామని – నా మనసు చింతాక్రాంతమై పోయింది. ఎందుకు నేను ఈ వైపరీత్యానికి పూనుకున్నానా అని? ప్రథమ సద్గురు సందర్శనం వర్ణించగల్గిన అక్షర లాలిత్యం నాకెక్కడిది? గురువుని దర్శించడమంటే ఈ మాటలా మూటలా! వేదాలకుందా ఈ స్థాయి? వేదవిదులకు అర్థమవుతుందా సద్గురుని స్థాయి! భాష్యకారుల భాషలో బంధించగలమా గురుదర్శనాన్ని! భావజాలముల, బహువచనముల, పటు కవిత్వముల, పండిత, వ్యాకరణ, ఛందస్సుల వర్ణించగల్గినదా గురుదర్శనము. నా బోంట్లను గూర్చే వేమన అని ఉంటాడు "అల్పుడెపుడు పల్కు ఆడంబరముగాను, సజ్జనుండు పల్కు చల్లగాను'' అని. సజ్జనుండు అంటే గుర్తొచ్చింది – సజ్జనుడు అంటే మా గురుదేవులే! వారు నా వంటి పామరుల నుద్ధరించిన పరమ జ్ఞాన భాస్కరులు. వెలుగుజాడ చేరని మా జీవితాలలో చల్లని వెన్నెలను కురిపించిన కరుణరస శరశ్చంద్రులు. మాకే సందేహానికైనా వారు కదిలొచ్చిన పుంభావ సరస్వతులు, సాయి సారస్వతులు. ప్రథమ గురుదర్శనాన్ని వర్ణించలేని నా కల్లోల మానసమునకు వారి ఈ మాటలు దీపస్థంబములై దారి చూపెను – సద్గురుని **"చూపును వర్ణించడానికి సరైన ఉపమానంగానీ, ఉదాహరణగానీ ఖచ్చితంగా ఇవ్వలేము. కానీ కనీసం రవ్వంతైనా అర్థం చేసుకోవడానికి నేను ఒక ఉదాహరణ ఇస్తాను. అపుడే పుట్టిన తన బిడ్డను తొలిసారి తల్లి చూసే చూపు ఎలా ఉంటుందో ఊహించండి. అప్పటివరకు ఆ బిడ్డ ఆమెలో భాగం, ఆమె శరీరంలో ఒక భాగం. ఆమె నుండి వేరుకాదు. బిడ్డ పుట్టగానే ఆ తల్లి చూసే మొదటిచూపు ఎలా ఉంటుందంటే, తనలోని భాగాన్నే తాను చూసుకుంటున్నట్లుగా ఉంటుంది. బిడ్డ ఏడుస్తుంది, పాలు కోరుతుంది... నెమ్మదిగా వాళ్లమధ్య ఇంటరాక్షన్ మొదలవుతుంది. క్రమేణా ఆ చూపులో తొలి అనుభూతి, గాఢత, ఏకత్వానుభవం తగ్గిపోతాయి. ఏ చూపు అయితే అన్నింటినీ, అందరినీ తనలోని ఒక భాగంగా చూడగలదో అదే దివ్యదృష్టి. దేనిని చూసినా అది కూడా నేనే! నా కంటే వేరు కాదు అని అనుభూతి చెందుతూ, అలా చూడగలగడాన్ని హంస, సోహం అంటారు. సో–అహం అంటే "నేనే". అది ఏదైనా కానివ్వండి. అదీ నేనే" అంటారు శ్రీబాబూజీ.** స్వామినాథన్‌కు తన సద్గురుని తొలి దర్శనానుభూతి గూర్చిన భావాలేమిటి? బిడ్డకోసం 'ద్వారం' వద్ద ఎదురుచూసే ద్వారకామాయి 'సాయి'లా 'గిని' రాకకోసం తన గురువు ఎదురుచూస్తున్నారా? తొలి దర్శనంలో చిన్నారి 'గిని'తో ఏమన్నారు తన గురుదేవులు? తదుపరి సంచికలో... **'గురుకృప'**

**దేన్నీ చులకనగా చూడకపోవడం చాలా ముఖ్యం.**



# పారాయణ

మొట్టమొదట బాబా యొక్క తత్త్వం ఏమిటి అని అర్థం కావాలంటే, ముందు ఆయన చరిత్ర చదవాలి. తిరిగి తిరిగి చదవాలి. తిరిగి తిరిగి చదవటం అంటే, మనం మామూలుగా చేసే పారాయణలాగా కాదు. మనం పారాయణ అని చేస్తుంటాం. అలా కాదు. అందుకే చరిత్ర చదవటం అన్నాను. చరిత్ర పారాయణ అనే పదం ఉపయోగించలేదు. పుస్తకాన్ని తీసుకుని ఇన్ని చాప్టర్లు, ఇన్ని పేజీలు అనుకొని, ఇంకా ఎంత ఉంది అని పేజీలు లెక్కపెట్టుకుంటూ, వెనక్కి త్రిప్పి చూసుకుంటూ చదవటమే మన దృష్టిలో పారాయణ అంటే.

మన దృష్టి ఎన్ని పేజీలు ఉన్నాయి అనే దాని మీదనే ఉంటుంది. అది పారాయణ కాదు, పరాయణతతో చేసేటటువంటిదే పారాయణ. దాంట్లో ఇన్వాల్వ్ కావాలి. నిమగ్నం కావాలి. ఆ పరాయణత మనము చేసేటువంటి పారాయణలో మాత్రం ఉండదు. ఒక నవల చదివినట్లుగా చదవాలి. ప్రతి లీలలోను ఒక ప్రశ్న వేసుకొని చదవాలి. అసలు ఈయన తత్వం ఏమిటి? ఈ లీలలంతా ఎందుకు చేసారు? ఈ లీలలన్నీ చేసేటపుడు ఆయన స్థితి ఏమై ఉండాలి? ఆయన మనఃస్థితి ఏమై ఉంటే ఈ లీలలు చేయడానికి అవకాశముంటుంది?

ఇట్లా ప్రశ్న వేసుకుంటూ, ఆయన తత్వాన్ని గురించి విచారణ చేస్తూ, మనం బాబా చరిత్ర చదివినట్లయితే ఒక్క పారాయణ చాలు. రోజు ఒక 2 పేజీలో, 3 పేజీలో చదివి, దాని గురించి ఒక్క అరగంట సేపు ఊరకనే ఆలోచిస్తూ ఉంటే చాలు. బాబా ఫోటో ముందు పీట వేసుకుని కూర్చునే పారాయణ చేయాల్సిన అవసరం లేదు. హ్యాపీగా ఈజీ చైర్‌లో కూర్చుని చదువుకోవచ్చు. బెడ్ మీద పడుకొని చదువుకోవచ్చు. మనకు కావలసింది బుర్రకెక్కడం. అట్లా చేయగలిగితే బాబాతో మనకు పరిచయం ఏర్పడుతుంది.

***సాయితత్వాన్వేషణకి సాయిచరిత్ర ఒకానొక సాధనం మాత్రమే.***

ఎవరో తలనొప్పని వచ్చారు. తగ్గిపోయింది. మనం ఆ లీల చదివాము. అబ్బా! బాబా ఎంత శక్తిమంతుడో అనుకున్నాము. అంతటితో అయిపోయిందా ఏమిటి? ఈ ఒక్క లీల నువ్వు నిజంగా అర్థం చేసుకునే ప్రయత్నం చేయి. అది చాలు. అలా ఎంతో జిజ్ఞాసతో బాబా చరిత్ర చదవాలి. చదివేటప్పుడు ఆ జిజ్ఞాసపట్ల, బాబా యొక్క తత్త్వం పట్ల మనకు కలిగే పరాయణత్వమే పారాయణ అంటే. ఆ పరుడెవరో, ఆయన తత్వాన్ని తెలుసుకోవాలని మనసు ఎంతో ఎదిగి పోతుందంటే మనం లేకుండా పోతాం. అదీ పరాయణత్వం అంటే. ఆ పరాయణత్వంతో చేసేటటువంటిదే పారాయణ.

ప్రతి లీల గురించి నిశితంగా ఆలోచించడం, మన నిజజీవితంలో జరిగేటటువంటి ప్రతి సంఘటనని ఒక లీలతో అన్వయం చేసుకోవడం, దాని తత్త్వం గురించి అన్వేషణ చేయడమే మనం చేయవలసింది. ఈ తత్త్వాన్వేషణకి చరిత్ర ఒక సాధనం మాత్రమే.



### అసలైన పారాయణ – బాబా పట్ల ప్రేమకు వ్యక్తీకరణ

సచ్చరిత్రలలో ఎన్ని పేజీలు త్రిప్పాము అని కాదు. అట్లా పేజీలు తిప్పేటటువంటి పారాయణ చెయ్యకండి అని అంటాను నేను. బాబా పట్ల మనకు కొన్ని అన్‌రిజాల్వ్‌డ్‌గా ఉండేటటువంటి ప్రశ్నలు మనలో వేసుకొని, ఆ ప్రశ్నలకు సమాధానాలను బాబా చరిత్రలలో వెతకండి. ఒక రీసెర్చ్‌లాగా చెయ్యండి. ప్రతి ఒక్కరూ ఒక ఎం.ఫిల్., పి.హెచ్.డి. చేస్తున్నట్లుగా. బాబా మీద పి.హెచ్.డి. చేస్తే ఎలా చేస్తారో అలా చెయ్యండి. చదవాలనుకుంటే అలా చదవండి. అంతేకాని రోజుకి ఇన్ని పేజీలు, చాప్టర్లు పారాయణ చెయ్యాలి అని చదువుకుంటూ పోకండి. నిజంగా చెప్పాలంటే మీకు దానివల్ల వ్యక్తమయ్యేది బాబా పట్ల మీ ప్రేమ కాదు.

### అర్థవంతమైన పారాయణ

తెలుసుకునేందుకు చదివేటటువంటిది పారాయణ. రొటీన్‌గా వారం రోజుల్లో, రెండో నాలుగో చాప్టర్ల చొప్పున చదవడం వంటిది పారాయణ కాదు. దానివల్ల ఏ మాత్రం ఉపయోగం లేదు. పారాయణ ఒక నియమంగా పెట్టుకొని చేయడంలో ఒకే ఉపయోగం ఉంది. నిద్ర వస్తున్నా, పనులున్నా పట్టించుకోక, మన మనస్సుని నిగ్రహించుకొని రోజూ ఒకే టైంలో కూర్చుని చదువుతాం చూసారా!, మనస్సుకు ఆ నిగ్రహం మాత్రం అలవాటవుతుంది. అంతే.

బాబా ఎవరు? ఆయన ఏమిటి? అని బాబాను గురించి తెలుసుకోవడానికి మాత్రం ఉపయోగపడదు. ఆయన మనల్ని ఎందుకు రక్షిస్తున్నాడు? అసలు ఎందుకు రక్షించాలి? మనల్నే ఎందుకు రక్షించాలి? నా ప్రత్యేకత ఏమిటి? ఇట్లా వందల ప్రశ్నలు వేసుకొని, ఈ ప్రశ్నలకు సమాధానాలను బాబా చరిత్రలో వెతుక్కోండి. Seeking answers for these questions is Parayana. ఆ Spirit of enquiry, ఒక scientific spirit ఉండాలి. ఎందుకు చేస్తున్నాం? ఎందుకు చేయాలి? అని ఆలోచించి చేసినప్పుడు మీరు చేసే పారాయణ meaningful అవుతుంది. ఒక రొటీన్‌గా, మెకానికల్‌గా, ఒక సాంప్రదాయంగా ఒక నమ్మకంతో చెయ్యద్దు. అనుభవంతో చెయ్యండి. ఇది నేను చెప్పేది. ఎందుకో నా నోటివెంట SaiSEEkers అని వచ్చింది Try to be SaiSEEkers.

– *శ్రీబాబూజీ*

బాబా ఎప్పుడూ మనం ఎంత బాగా చేసామని చూడరు, ప్రయత్నం చేస్తున్నామా లేదా అని చూస్తారు. ఒక పసిపిల్లాడికి a,b,c,dలు నేర్పించాం. a కూడా సరిగ్గా వ్రాయలేడు. ఏదో ఒక గీత గీస్తాడు. ఎంత మురిసిపోతాం మనం. వాడు a అని వ్రాయడానికి ప్రయత్నిస్తున్నాడా లేదా అని చూస్తాం. అబ్బ! మావాడు రైటింగ్ నేర్చుకుంటున్నాడని మురిసి ముక్కలైపోతాం. బాబా కూడా మనల్ని అట్లాగే చూస్తారు. మనం కూడా బాబా దగ్గర అటువంటి బిడ్డలమే.

వీడు ఎంత బాగా చేస్తున్నాడు, వీడికి ఎక్కువ అవకాశాలు ఇవ్వాలి అని ఆయన అనుకోరు. మనం చేస్తుంటే చాలు. మీకు చేతనయినట్లుగానే చెయ్యండి. చిన్న పిల్లవాడు తప్పటడుగులు వేసేటట్లుగా, వచ్చీ రాకుండా a,b,c,dలు వ్రాసినట్లుగా. మనమేదో చేసేస్తామని కాదు. నాకు ఆ అభిప్రాయం ఎవ్వరి మీద లేదు. మీ ఎఫీషియన్సీని మాత్రం నేనెప్పుడూ చూడను. మీ ఆర్తి, మీ ప్రేమ, చెయ్యాలనేటు వంటి ఆ తపన, అది నాకు ఇంపార్టెంట్. ఎప్పుడైనా ఎవరినైనా కరెక్ట్ చేస్తే ఆ ఏరియాలో కరెక్ట్ చేస్తాను. అంతేకాని తప్పు చేసాడని ఎప్పుడూ కరెక్ట్ చేయను. ఎందుకంటే దాని గురించి నాకు పట్టింపేలేదు. తప్పులు మనం కాకపోతే ఇంకెవరు చేస్తారయ్యా! అది మన జన్మహక్కు.

-శ్రీబాబూజీ



**జీవితం యొక్క పూర్తి ఔన్నత్యం గూర్చి తెలుసుకోవడమే ఆధ్యాత్మికత.**

# బాబా పథం

మనలోని అవగాహన, మనలో ఉండే మానవత్వం, మనలో ఉండే Sense of responsibility, sense of obligation to ourselves, to the people around us and to the society. ఎవ్వరినీ ద్వేషించకుండా, అసూయా ద్వేషాలకు లోనవకుండా హ్యాపీగా ఆనందంగా జీవితం గడపడం, ఆ గడపడానికి అవసరమైన అవగాహనని పెంపొందించుకోవటం, వీటన్నింటికీ బేస్‌గా బాబా అనే సెక్యూరిటీ పోల్‌ని పట్టుకుని ఉండటం - ఇది నాకు తెలిసిన సాయిపథం. ఇక మిగతా వాటి గురించి నేను పట్టించుకోను, నాకు తెలియదు. ఈ కోపాలు, ఈ చిరాకులు ఒకరిని గురించి నెగెటివ్‌గా మాట్లాడటాలు, గాసిపింగ్ - ఇవన్నీ చేస్తున్నామా లేదా, ఇవి మనలో ఎంత వరకు పోయాయి, మనం ఒక హ్యూమన్ బీయింగ్‌గా ఎంత ఎవాల్వ్ అవుతున్నాము అని తరచి చూసుకోవాలి. ది ప్రాసెస్ ఆఫ్ ఎవల్యూషన్ నాకు ఇష్టం.

నా దృష్టిలో సాయిపథం అంటే అది. బాబా పథం అంటే అది.

బాబా పథం అంటే అది.

